# వాహనం ఆర్సీ గడువు 15 ఏండ్లే..

హైదరాబాద్,సాధారణంగా ప్రైవేట్ వాహనం గృహ సర్టిఫికెట్ (ఆర్సీ) గడువు 15 సంవత్సరాలపాటు ఉంటుంది. ఇది ముగిసిన తర్వాత ప్రతి ఐదేండ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. లేకుంటే ఆర్టీవో అధికారుల తనిఖీల్లో పట్టుబడినప్పుడు భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత ఆర్సీ రెన్యువల్ చేసుకోకుంటే సంవత్సరానికి వాహనం ఖరీదులో 10 శాతం వరకు అదనంగా ఫైన్ కట్టాల్సి ఉంటుంది. న్యాయపరమైన చికులు రాకుండా ఉండాలంటే గడువు ముగిసే తేదీకి ముందే రెన్యువల్ చేసుకోవడం ఉత్తమం. ఈ ఆన్‌లైన్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్సీ రెన్యువల్‌కు ఫారం–25, దరఖాస్తు ఫారం, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్, ఆర్సీబుక్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, సింగపూర్ సర్టిఫికెట్, రోడ్‌టాక్స్ చెల్లించిన డాక్యుమెంట్లు, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పాన్‌కార్డు, చాసిస్, ఇంజిన్ పెన్సిల్ పాయి.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :181 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 17-09-2024 | పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట.. రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెడతారా



హైదరాబాద్: సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీఆర్) ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరును ఖండించారు. తెలంగాణ స్వపరిపాలన సౌధం ముందు తుచ్ఛమైన స్వార్థ రాజకీయాలకు తెరతీస్తారా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల ప్రజల గుండెచప్పుడైన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట.. రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెడతారా అంటూ విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ సర్కార్ తెలంగాణ తల్లిని అవమానిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్‌ను క్షమించదంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు.

'తెలంగాణ తల్లిని అవమానిస్తారా ?

తెలంగాణ ఆత్మతో ఆటలాడతారా ?

తెలంగాణ అస్తిత్వాన్నే కాలరాస్తారా ?

తెలంగాణ ఉద్యమస్ఫూర్తి ఊపిరి తీస్తారా?

తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవహేళన చేస్తారా ?

తెలంగాణ మలిదశ పోరాట దిక్సూచిని దెబ్బతీస్తారా ?

తెలంగాణ అమరజ్యోతి సాక్షిగా ఘోర అపచారం చేస్తారా ?

తెలంగాణ స్వపరిపాలన సౌధం ముందు.. తుచ్ఛమైన.. స్వార్థ రాజకీయాలకు తెరతీస్తారా ?నాలుగు కోట్ల ప్రజల గుండెచప్పుడైన.. 'తెలంగాణ తల్లి' విగ్రహం పెట్టాల్సిన చోట 'రాహుల్ గాంధీ తండ్రి' విగ్రహం పెడతారా..?? తెలంగాణ కాంగ్రెస్‌ను క్షమించదు..!' అంటూ ట్వీట్ చేశారు.సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడాన్ని బీఆర్ఎస్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఆ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశంలో ఎవరి విగ్రహాలు పెట్టినా ఊరుకునేది లేదని కేటీఆర్ గతంలోనే తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజీవ్ రాజీవ్‌ను తొలగించి.. ఆ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించామని స్పష్టం చేశారు.

## రెండు వర్గాలుగా చీలిపోయిన బీఆర్ఎస్ పార్టీ?



హైదరాబాద్,బీఆర్ఎస్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోందా? ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ– కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై కారు పార్టీలో అంతర్గత ప్రకంపనలు కొనసాగుతున్నాయా? ఈ ఎపిసోడ్‌లో గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు ఎందుకు దూరంగా ఉన్నారు? అధినేత ఉండమన్నారా? తమ కుర్చీ కిందకు నీళ్ల రాకుండా ఎమ్మెల్యేలు దూరంగా ఉండేందుకు ప్రయత్నిసున్నారా? అధినేత కేసీఆర్ సైలెంట్ వెనుక కారణం అదేనా? దీన్ని హ్యాండిల్ చేయమని కేటీఆర్ అప్పగించారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ– కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. ఈ విషయాన్ని హరీష్‌రావు, కేటీఆర్‌లు మాత్రమే స్పందించారు. దీన్ని శాంతిభద్రతల ఇష్యూగా డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ప్రాంతీయం చిచ్చు ప్రజల్లోకి వెళ్లిపోయింది. దీంతో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు అంటిముట్టనట్టుగా ఉంటున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో 16 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. రీసెంట్‌గా జరిగిన ఉప ఎన్నికల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ జారిపోయింది. 15 సీట్లకు గాను ఖైరతాబాద్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు కారు పార్టీ కీలక నేతలు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఆ సంఖ్య 12కి పడిపోయింది.ప్రాంతీయం మాటల ఎపిసోడ్ తమ ఓటు బ్యాంకు మీద ప్రభావం చూపుతుందే మోనని భయపడుతున్నారు మిగతా ఎమ్మెల్యేలు. కౌశిక్‌రెడ్డి ఇంటి ఘటన తర్వాత ఆయనను పరామర్శించేందుకు గ్రేటర్ పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలు కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కానీ విడివిడిగా వెళ్లారు. ఏ ఒకొక్కరుగా నోరు మెదపలేదు. మీడియా ముందు మాట్లాడే ప్రయత్నం చేయలేదు. గ్రేటర్‌లోని ప్రతీ నియోజకవర్గంలో గెలుపు ఓటములు శాసించే స్థాయిలో ఆంధ్రా ఓటర్లు ఉన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పరువు కాపాడింది వాళ్లే. ఈ సమయంలో కౌశిక్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడి ఇరుక్కో వడం ఎందుకని భావిస్తున్నారట. ఈ విధంగా తమ కుర్చీ కిందకు నీళ్లు తె చ్చుకోవడం కంటే..దూరంగా ఉండడమే బెటరని దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు నిర్ణయానికి వచ్చినట్టు ఆ పార్టీ అంతర్గత సమాచారం.పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. రేపటి రోజున మరి కొందరు ఎమ్మెల్యేలు కారు దిగి అధికార పార్టీ గూటికి చేరుతారనే వా ర్తలు జోరందుకున్నాయి.ఈ ఇష్యూని హ్యాండిల్ చేయమని కేటీఆర్‌కు అధి నేత కేసీఆర్ అప్పగించినట్టు ఆ పార్టీ నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో యువనేత ప్రత్యేకంగా మాట్లాడుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం కారు పార్టీలో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## హైదరాబాద్‌లో రేపు,ఎల్లుండి ట్రాఫిక్ మళ్లింపు..



హైదరాబాద్, హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా మంగళ, బుధవారాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలు హుస్సేన్ సాగర్ వైపు రానుండటంతో నగర వ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయబోతున్నారు.సిటీలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రధాన మార్గాల్లో విగ్రహాల ఊరేగింపులు వెళ్లేందుకు వీలుగా సాధారణ ట్రాఫిక్ పై ఆంక్షలు విధించారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని సెప్టెంబర్ 17, 18తేదీల్లో నగర వ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు.ఇక, బాలాపూర్ నుంచి గుర్రం చెరువు ట్యాంక్‌పై కట్టమైసమ్మ ఆలయం దగ్గర గణేష్ విగ్రహ ఊరేగింపు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశిస్తుందని సీపీ ఆనంద్ తెలిపారు. కాబట్టి, కేశవగిరి, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ (లెఫ్ట్ టర్నింగ్), ఎంబీఎన్ఆర్ ఎక్స్ రోడ్, ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జ్, ఆలియాబాద్, చార్మినార్, మదీనా, అఫ్జల్‌గంజ్, మొహంజాయి మార్కెట్, అబిడ్స్ ఎక్స్ రోడ్, బషీర్‌బాగ్, లిబర్టీ జంక్షన్, ఎన్టీఆర్ మార్గ్, పీవీఎన్ఆర్ మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహం వైపు వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.అలాగే, సికింద్రాబాద్ నుంచి వచ్చే వినాయక విగ్రహ ఊరేగింపులు సంగీత్ థియేటర్, ప్యాట్నీ, ప్యారడైజ్ జంక్షన్, ఎంజీ రోడ్డు, కర్బలా మైదాన్, ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్డుకు వెళ్లనున్నాయి. ఇక, చిలకలగూడ కూడలి నుంచి వచ్చే విగ్రహాలు గాంధీ ఆసుపత్రి, ఆర్టీసీ క్రాస్ రోడ్, నారాయణగూడ ఫ్లైఓవర్, వై.జంక్షన్, హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ వైపు వెళ్తాయని పోలీసులు సూచించారు. దీంతో పాటు ఉప్పల్ నుంచి వచ్చే గణేష్ ఊరేగింపులు రామంతాపూర్, శ్రీ రమణ జంక్షన్, ఛే నంబరు, తిలక్‌నగర్, ఓయూ ఎన్‌సీసీ గేట్, విద్యానగర్ జంక్షన్, ఫీవర్ ఆస్పత్రి, బర్కత్‌పుర జంక్షన్ మీదుగా వెళ్లాలి.. ఆ ఊరేగింపులు నారాయణగూడ వైఎంసీఏ కూడలికి చేరుకొని, ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచే వచ్చే ఊరేగింపుతో కలవనుంది.దీంతో పాటు, దిల్‌సుఖ్‌నగర్ నుంచి వచ్చే గణేష్ విగ్రహాలు ఐఎస్ సదన్, సైదాబాద్, చంచల్‌గూడ ఉంచి వచ్చే ఊరేగింపుతో నల్గొండ ఎక్స్ రోడ్డులో కలవనుంది అని హైదరాబాద్ నగర పోలీసులు తెలిపారు. ఇక, తార్నాక వైపు వచ్చే విగ్రహాలు ఉస్మానియా విశ్వవిద్యాలయం దూర విద్యాకేంద్రం రోడ్డు, అడిక్‌మెట్ వైపు వెళ్లి విద్యానగర్ మీదుగా ఫీవర్ ఆసుపత్రి వద్దకు చేరుకోనున్నాయి. అలాగే, టోలిచౌకి, రేతిబౌలి, మోహిదీపట్నం వైపు నుంచి వచ్చే గణేష్ విగ్రహాలు మాసబ్‌ట్యాంక్, అయోధ్య జంక్షన్, నిరంకారి భవన్, ద్వారకా హోటల్ జంక్షన్, ఇక్బాల్ మినార్ మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు వెళ్లనున్నాయి. ఇక, ఎర్రగడ్డ నుంచి వచ్చే విగ్రహాలు ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ మీదుగా మోహిదీపట్నం నుంచి వచ్చే ఊరేగింపు నిరంకారి భవన్ వద్ద చేరి, ఎన్టీఆర్ మార్గ్ వరకు వెళ్లనున్నాయి.అలాగే, టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చే గణేష్ విగ్రహాలు సీతారాంబాగ్, బోయిగూడ కమాన్, వోల్గా హోటల్ ఎక్స్‌రోడ్, గోషామహల్, మాలకుంట జంక్షన్ మీదుగా వెళ్లి ఎంజేఎం దగ్గర ప్రధాన ఊరేగింపులో కలుస్తాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో సాధారణ ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగవచ్చు.. ఊరేగింపు కొనసాగే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి.. ప్రజలు అందుకు అనుగుణంగా తమ ప్రయాణ మార్గాన్ని నిర్దేశించుకోవాలని సీపీ సీవీ ఆనంద్ సూచించారు.

## ముంబై నటి జత్వానీ కేసు.. ఆ ముగ్గురు ఐపీఎస్‌లకు షాక్ !




అమరావతి,దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న ముంబై సినీ నటి కాదంబరి జత్వానీ వ్యవహారంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లు నిండా మునిగిపోయారు. తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ పంపడంతోపాటు తన కుటుంబంతో సహా కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారంటూ నటి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదులో సదరు ఐపీఎస్‌లు మొదటి నుంచి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.దీంతో డీజీపీ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం, దాని ఆధారంగా సీనియర్ ఐపీఎస్ అధికారి, జగన్ సర్కార్‌లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన పి. సీతారామాంజనేయులు, గత ప్రభుత్వంలో విజయవాడ పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వహించిన మరో సీనియర్ ఐపీఎస్ కాంతిరాణా టాటా, అదే సమయంలో విజయవాడ డీసీపీగా పనిచేసిన విశాల్ గున్నిలను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయవాడ వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ నాటి ఇన్‌స్పెక్టర్ ఎం. సత్యనారాయణరావులను ఇప్పటికే డీజీపీ సస్పెండ్ చేశారు. తాజా పరిణామంతో జత్వానీ కేసులో క్రమేణా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏకంగా రాష్ట్రంలో ఒకే వ్యవహారంలో ఒకేసారి ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లపై ప్రభుత్వం వేటు వేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం.గత ఎన్నికల సమయంలో పలువురు ఎస్పీలు, డీఐజీలపై ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళి కింద చర్యలకు ఉపక్రమించినా.. ప్రభుత్వం ఏకకాలంలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లను సస్పెండ్ చేయడం తొలిసారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.అధికార దుర్వినియోగం, శాఖాపరమైన తప్పిదం, విధుల్లో నిర్లక్ష్యం, స్కాంలు, ఆర్థికపరమైన, ఇతరత్రా కారణాల కింద సస్పెన్షన్ వేటు పడటం జరుగుతుంది. కానీ ఇక్కడ పీఎస్సార్, కాంతిరాణా, విశాల్ గున్ని విషయానికొస్తే ఓ ప్రైవేటు వ్యక్తి, మహిళ ఫిర్యాదు మేరకు నమోదైన క్రిమినల్ కేసులో ఆరోపణలతో సస్పెండ్ కావడం ఐపీఎస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.కాగా ముంబైలో తాను పెట్టిన కేసును వెనక్కు తీసుకునేందుకు తనపై విజయవాడలో అక్రమ కేసులు బనాయించారని, కుక్కల విద్యాసాగర్ అనే వైసీపీ నాయకునితో ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసు పెట్టించి తనను, తల్లిదండ్రులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపి ముంబై కేసు విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చి చిత్రహింసలకు గురిచేశారన్నది బాధితురాలు నటి జత్వానీ ప్రధాన ఆరోపణ.గత ప్రభుత్వంలోని కొందరు పెద్దల సిఫార్సుతో రంగంలోకి దిగిన నాటి నిఘా బాస్ పీఎస్సార్, అప్పటి విజయవాడ సీపీ కాంతిరాణా టాటా, డీసీపీ విశాల్ గున్ని కనుసన్నల్లో పోలీసులు వ్యవహరించారని, తెర వెనుక పథకం రచించి పీఎస్సార్ కథ నడిపించారన్నది తీవ్ర ఆరోపణ.ఈమేరకు విజయవాడ ప్రస్తుత సీపీ రాజశేఖరబాబు నియమించిన విచారణాధికారి స్రవంతి రాయ్ ఎదుట బాధితురాలు వెల్లడించిన అంశాలకు సంబంధించిన నివేదికను సీపీ ద్వారా డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మూడు రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదించారు.ఈ నివేదికలో సదరు ముగ్గురు ఐపీఎస్‌ల ప్రమేయాన్ని స్పష్టంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో బాధితురాలు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, దానిపై క్రైం నంబర్ 469/2024, ఐపీసీ 192, 211, 218, 220, 354 (డి), 467, 420, 469, 471, రెడ్‌విత్ 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదు కావడం, అప్పటికప్పుడే వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సత్యనారాయణలను సస్పెండ్ చేశారు.కేసు నమోదు అంశాన్ని సైతం డీజీపీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. డీజీపీ నివేదిక ఆధారంగా సదరు ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ ఫైల్‌పై సీఎం చంద్రబాబు సంతకం చేశారు. దీంతో సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జీవో నెంబర్లు 1590, 1591, 1592 విడుదల చేశారు. కాగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కాన్ఫిడెన్షియల్ అని పేర్కొనడం గమనార్హం.

### విశాల్ గున్నీపై ఆంక్షలు..

నటి జత్వానీ కేసులో సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిపై ఆంక్షలు విధించింది. ఆయన్ను సస్పెండ్ చేయడానికి కారణాలను జీవోలో ప్రభుత్వం పేర్కొంది. నటి కాందంబరి జత్వానీపై విజయవాడ ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో 2024 ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 6.30 గంటలకు క్రైం నెంబర్ 384, 385, 386, 388, 420, 457, 468, 471, రెడ్‌విత్ 12(బి), ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదైంది.ఈ కేసులో దర్యాప్తు పర్యవేక్షించడంలో అప్పుడు డీసీపీగా ఉన్న విశాల్ గున్నీ పూర్తిగా విఫలమయ్యారు. ప్రాథమిక విచారణ జరపకుండానే నటి జత్వానీని అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీ సీతారామాంజనేయులను 2024 జనవరి 31న కలిశారు.ఆయన మౌఖిక ఆదేశాల ప్రకారం ఫిబ్రవరి 2న ముంబై వెళ్లారు. ఎఫ్ఐఆర్ ఆరోజు ఉదయం ఆరున్నరకు నమోదు చేసి ఏడున్నర గంటలకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అధికారిక రాతపూర్వక ఉత్తర్వులు లేకుండా బయలుదేరి వెళ్లారు.

## ఢిల్లీ రాజకీయాలపై కొనసాగుతున్న ఉత్కంఠ..



న్యూఢిల్లీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయంతో ఢిల్లీ రాజకీయాల ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని కేజ్రీవాల్ ప్రకటించిన విషయం తెలిసిందే. రేపు శాసనసభ పక్ష సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకునే అవకాశం ఉంది. అయితే, కొత్త ముఖ్యమంత్రి ఎంపిక ఉంటుందా.. లేకుంటే ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు వెళ్తారా అనే అంశం ఆసక్తికరంగా మారింది. కేజ్రీవాల్ ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ముందస్తుగా ఈ నవంబర్ లోనే ఎన్నికలు నిర్వహించాలని కేజ్రీవాల్ కోరుతున్నారు. ముందస్తు ఎన్నికలకోసం ప్రభుత్వాన్ని రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. నవంబర్ నెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలతో పాటు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కేజ్రీవాల్ ఇప్పటికే డిమాండ్ చేశారు. దీంతో ఆయన ప్రభుత్వాన్ని రద్దు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్న వాదన ఆప్ వర్గాల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వాన్ని రద్దుచేస్తే ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం లేకపోతే కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసి ప్రజల్లోకి వెళ్లాలన్న వ్యూహంలో కేజ్రీవాల్ ఉన్నారు. ఈ క్రమంలో రేపు ఆప్ శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కేజ్రీవాల్ ఏం చేయబోతున్నారనే అంశంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయాల్సి వస్తే రేసులో కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ ముందు వరుసలో ఉన్నారని తెలుస్తోంది. ఆమెతో పాటు అతిశీ, కైలాష్ గెహ్లాట్, గోపాల్ రాయ్, సౌరబ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్ పేర్లు వినిపిస్తున్నాయి. సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సందర్భంలో కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తమను నిజాయితీపరులమని గుర్తిస్తేనే పదవుల్లో ఉంటామని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే కేజ్రీవాల్ సంచలన నిర్ణయంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. కేజ్రీవాల్ యూటర్న్, సింపతి, డ్రామా రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు పేర్కొంటున్నారు.అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ నేతలు స్పందించారు. కేజ్రీవాల్ పై సుప్రీంకోర్టు ఇప్పటికే నిషేధం విధించినందున సీఎం పదవికి రాజీనామా చేయడం రాజకీయ జిమ్మిక్కు అని కాంగ్రెస్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ అన్నారు. అవినీతి ఆరోపణలపై జైలుకు వెళ్లడం వల్లనే కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని, ఆరు నెలల క్రితమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఉండాల్సింది అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన సతీమణిని ముఖ్యమంత్రిని చేయడానికే కేజ్రీవాల్ నాటకమాడుతున్నారని బీజేపీ పేర్కొంది. అవకాశవాదంలో ఆయన పీహెచ్‌డీ చేశారని, మద్యం కేసులో ఆయన్ను కోర్టు విముక్తుడిని చేయలేదని, కేవలం బెయిల్ మాత్రమే ఇచ్చిందని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కారణంగానే కేజ్రీవాల్ పదవికి రాజీనామా చేయాల్సి వస్తోందని బీజేపీ నేతలు అన్నారు.

## రేషన్ కార్డుల నిబంధనలు మార్చాలి..

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా జారీ చేయబోతున్న రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి సంబంధించిన నిబంధనలు మార్చాలని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 5.67 లక్షల నిరుపేద కుటుంబాలు అంత్యోదయ అన్న యోజన కార్డులను ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ మేరకు రేషన్ కార్డుల జారీ కోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి ఓవైసీ వినతి పత్రం అందజేశారు.ఇక, గ్రామాల్లో రూ. 1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలుగా ఉన్న ఆదాయ పరిమితితో పాటు భూ పరిమితిని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సవరించాలని ఎంఐఎం ఎపీ అసదుద్దీన్ ఓవైసీ కోరారు. ఈ క్రమంలో దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారి కుటుంబాలకు, ఒంటరి మహిళలకు, హస్త కళాకారులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను ఇవ్వాలని తెలంగాణ సర్కార్ కు ఆయన సూచించారు. ప్రస్తుతం ఎంఐఎం పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వానికి సపోర్ట్ తెలుపుతుంది. ఇకపోతే,



రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం విధించిన ఆదాయ నిబంధనలను మార్చాలని చాలా రోజులుగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ రోజు జలసౌదాలో జరిగే జరిగే సమావేశంలో కేబినెట్ సబ్ కమిటీ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది అనేది వేచి చూడాలి.

## సంపాదకీయం

మంగళవారం 17-09-2024

# బెయిల్ హక్కు.. జెయిల్ కాదు

దేశంలో ప్రజాస్వామిక చట్టబద్ధమైన న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ ప్రజలకు న్యాయం అందుతున్న తీరు చాలా వివాదాస్పదంగా తయారైందని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. దేశంలో దాదాపు 5 కోట్ల పెండింగ్ కేసులు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యుపిఎ) వంటి ప్రత్యేక చట్టాల ప్రకారం జరిగే నేరాలకు కూడా 'బెయిల్ అనేది ఒక రూల్. జైలు ఒక మినహాయింపు' అనే చట్టపరమైన సూత్రం వర్తిస్తుందని సుప్రీం కోర్టు అనేక సందర్భాల్లో పదే పదే గుర్తు చేస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు మద్యం విధానం కుంభకోణానికి సంబంధించిన సిబిఐ కేసులో బెయిల్ మంజూరు చేసేటప్పుడు బెయిల్ అంటే జైలు కాదని మరోసారి ప్రస్తావించింది. 22 నెలలుగా ఊరికే ఉన్న సిబిఐకి, ఇడి కేసులో బెయిల్ వచ్చిన వెంటనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. బెయిల్‌ను అడ్డుకోవడమే దీని ఉద్దేశంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. బిఆర్ఎస్ నేత, ఎంఎల్‌సి అయిన కవితకు బెయిల్ ఇచ్చేటప్పుడు కూడా దర్యాప్తు సంస్థ తీరును సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ఇలా ఎన్నో కేసుల్లో దర్యాప్తు సంస్థలు బెయిల్‌ను అడ్డుకోవడం, సుప్రీం కోర్టు మందలించడం జరుగుతోంది. అర్హమైన కేసుల్లో బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే, చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యుపిఎ)కింద నిందితుడైన జలాలుద్దీన్ ఖాన్ అనే వ్యక్తికి బెయిల్ మంజూరుపై సుప్రీం కోర్టు గత ఆగస్టులో గట్టిగా విచారించింది. బెయిల్ అనేది నియమమని, ప్రత్యేక చట్టాలకు కూడా జైలు మినహాయింపు వర్తిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత ఉన్న కేసుల్లో కోర్టులు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే అది ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెయిల్ హక్కును హైకోర్టులే కాలరాస్తున్న చేదు వాస్తవం పట్ల సుప్రీం కోర్టు గతంలో కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. 2022లో ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాది పార్టీ అగ్రనేత అజాంఖాన్ తన బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా తీవ్రజాప్యం చేస్తున్నారన్న ఫిర్యాదుపై సుప్రీం కోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. ప్రభుత్వాలు రాజకీయ కక్షతో కేసులను ఏ విధంగా పెంచి పోషిస్తున్నాయో అందులో వెల్లడైంది. 'నిందితుడు రెండేళ్లుగా జైల్లో కొనసాగుతున్నా డు. ఒకటి కాదు, రెండు కాదు, 89 కేసులా! ఒక కేసులో బెయిలుపై విడుదల కాగానే, మరో కేసులో లోపలికి పంపిస్తున్నారు' అని సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. నిందితులను బయటకు రానీయకుండా జైలులోనే నిర్బంధించి ఉంచడానికి ఆయా ప్రభుత్వాలు, వాటి పోలీస్ యంత్రాంగాలు ఎన్ని పన్నాగాలు పన్నినా బెయిలు మంజూరు విషయంలో మాత్రం అనవసర ఆలస్యం చేయడం కానీ, లేనిపోని షరతులు విధించడం కానీ తగదని హైకోర్టులకు సుప్రీం కోర్టు హెచ్చరించింది. బెయిల్‌ను తిరస్కరిస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేసిన జలాలుద్దీన్ ఖాన్‌కు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరుచేసింది. బీహార్‌లో ప్రధాని మోడీ పర్యటనకు అంతరాయం కలిగించే వ్యూహంలో ఖాన్ ప్రమేయం ఉందని వివిధ సెక్షన్ల (యుఎపిఎ, ఐపిసి) కింద అతనిపై కేసు నమోదైంది. 2002లో గుజరాత్ అల్లర్లకు సంబంధించిన కేసుల్లో దొంగపత్రాలు దాఖలు చేసి ఫోర్జరీకి పాల్పడ్డారన్న అభియోగంపై ప్రముఖ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు సుప్రీం కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడం ఒక మంచి పరిణామం. పాలకులను ఎదిరించి మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడే వ్యక్తులకు, సంస్థలకు ఈ పరిణామం ప్రోత్సాహకారి అవుతుంది. తగిన కారణాలు లేకుండా బెయిల్ మంజూరును వీలైనంత ఆలస్యం చేయడం ఎప్పటికీ మంచి పనికాదు. ఒక మహిళను ఆమె బెయిల్ అభ్యర్థనపై అనవసర కాలయాపన చేస్తూ జైలులో నిరవధికంగా నిర్బంధించడం తగదని త్రిసభ్య ధర్మాసనం తీస్తా సెతల్వాడ్‌కు బెయిల్ మంజూరు చేసింది. యోగ్యమైన కేసుల్లో కింది కోర్టులు బెయిల్ తిరస్కరిస్తున్నందున ఆ భారం సుప్రీం కోర్టు మీద పడుతోంది. ఆలోగా జైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. వ్యక్తి స్వేచ్ఛ నిరవధిక బందీ అయిపోతోంది. 2012 నాటి ఛీటింగ్ కేసులో అరెస్టయిన ఒక మహిళపై ఆరోపణలను నిర్ధారించక పోవడంతో ఆమె తొమ్మిదేళ్లు జైలులో మగ్గిన ఉదంతం ఢిల్లీలో చోటు చేసుకుంది. బెయిల్ కోరడమనేది వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని, అది రాజ్యాంగం 21వ అధికరణ హామీ ఇస్తున్న జీవనస్వేచ్ఛలో అంతర్భాగమని ఢిల్లీ హైకోర్టు కూడా ఒక కేసులో ప్రస్తావించింది. ఉరివంటి తీవ్ర శిక్షల కేసుల్లో తప్ప సాధారణ కేసుల్లో బెయిల్ దరఖాస్తులపై సానుకూల నిర్ణయం తీసుకోడానికే ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. నాన్‌బెయిల్‌బుల్ కేసుల్లో కూడా ఉచితానుచితాలను లోతుగా పరిశీలించి బెయిల్ మంజూరు చేసే అధికారం ఉన్నత న్యాయస్థానాలకు ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

# గులాంగిరీ వదలని తెలంగాణ పాలకులు !

హైదరాబాద్,విమోచన దినోత్సవం జరపడం అంటే ప్రభుత్వాలకు ఎందుకు భయం...తెలంగాణ విమోచన దినోత్సవాలపై అధికారంలో ఎవరున్నా ఎందుకు భయపడడం అలవాటు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదలు.. ఇప్పటి వరకు అదే ఆనవాయితీ సాగుతోంది. తెలంగాణ విమోచన ఉద్యమం లేదా రైతాంగ ఉద్యమం అన్నది ముష్కర మూకలను చెండాడిన చారిత్రక సన్నివేశం. ఆ సమయంలో కమ్యూనిస్టులు పోరాటం మరువ లేనిది. తొమ్మిదనరేళ్లు పాలించిన కెసిఆర్ ఈ ఉద్యమాన్ని చిన్నచూపు చూసి, తెలంగాణ ప్రజలను అవమాన పరిచారు. అలాగే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో నడుస్తోంది. తెలంగాణ విమోచన ఉద్యమాన్ని అధికారిక నిర్వహించాలని కమ్యూనిస్టులు డిమాండ్ చేస్తున్నా..ప్రజాపాలన దినోత్సవం పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కప్పదాటు వ్యవహారం ప్రదర్శిస్తోంది. తెలంగాణలో రక్తపుటేరులు పారించిన నవాబులకు గులాములుగా పాలకులు వ్యవసహరిస్తున్నారు. ప్రజల ప్రాణత్యాగాలను చిన్నచూపు చూస్తున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. విమోచనోత్సవం జరుపుకోవడం అంటు రజాకార్ల దాష్టికాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి దాష్టీకాల్లో ప్రాణాలర్పించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన జరిగిన శుభతరుణంగా పరిగణించడంలో తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశుల విూద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. రష్యా ఉద్యమం కావచ్చు..ఫ్రెంచ్ విప్లవం కావచ్చు...చైనా స్వాతంత్ర్యం కావచ్చు..భారత స్వాతంత్ర్య సంగ్రామం కావచ్చు..అన్నీ ఈ కోవలోకి వచ్చేవే. విమోచన జరిపితే ముస్లింలకు కోపం వస్తుందనో..వారి ఓట్లు పోతాయనో కుంచిత ఆలోచనలు చేసే పాలకుల ఉన్నందుకు సిగ్గుపడాలి. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించడానికి జరిగిన రైతాంగ పోరాటం ముమ్మాటికి తిరుగబాటుచరిత్రే అవుతుంది. చైనా, రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవం జరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించింది. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగబడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూరభూస్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్న ప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాంను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరపున దాడులు చేశారు.




పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచ కాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్ వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. అంతకు మించి పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడాని కి కూడా సిద్దం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగి పోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థానం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతున్న అరాచాకాలను కమ్యూనిస్టులు, రైతులు, మహిళలు ఎదరించి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యానికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడంతో పాటు,ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి జరిగిన విముక్తి పోరాటం కావడం తో ప్రజల్లో సహజంగానే ఆనందం వెల్లి విరిసింది. బానిస సంకెళ్లు తెగినందుకు ఆనందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరవాత విమోచనో త్సవాన్ని పక్కన పెట్టిన కెసిఆర్ చరిత్రహీనుడిగా మిగిలారు. రెండేళ్ల క్రితం కేంద్రం విమోచన దినోత్సవం అధికారికంగా జరపాలని నిర్ణయించి..ఉత్సవాలను జరిపింది. దీనిని విమోచన దినంగా, స్వాతంత్ర్య దినంగా జరపాలని అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆనాటి కాంగ్రెస్ నేత,నేటి డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ వేదికగా దీనిని ప్రస్తావించడం గుర్తు చేసుకోవాలి. కానీ నేడు ఎందుకనో వారే ఇప్పుడు తెలంగాణ విమోచన ఉద్యమాన్ని కాదన ప్రజాపాలన అంటూ ఉత్సవం నిర్వహించాలనుకోవడం సిగ్గుచేటు.

# కశ్మీర్ బిజెపికి రెఫరెండమే!




జమ్మూ:హిమాలయాలతో నిత్యం అతిశీతల వాతావరణం ఆవరించిన జమ్మూకశ్మీర్‌లో చలిగాలులు కన్నా ఎన్నికల వడగాలులే తీవ్రంగా వీస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఘట్టం మరో ఐదు రోజుల్లో ప్రారంభం కానుండడంతో జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నాయి. హామీల జల్లులు కురిపిస్తున్నాయి. కాంగ్రెస్, మిత్రపక్షం నేషనల్ కాన్ఫరెన్స్ ప్రధానంగా ఆర్టికల్ 370 ను రద్దు చేసి ఇదివరకులా ప్రత్యేక స్వయంప్రతిపత్తితో రాష్ట్రహోదా కల్పిస్తామని తమ అజెండాలో ప్రధాన అంశంగా ప్రకటించాయి. కాషాయం పార్టీ బిజెపి ఆర్టికల్ 370 రద్దు ముగిసిపోయిన చరిత్ర అని, ఎట్టిపరిస్థితుల్లో పునరుద్ధరించేది లేదని స్పష్టం చేస్తోంది. ఆర్టికల్ 370 వల్లనే కశ్మీర్ యువకులు హింస వైపు మళ్లారని కూడా హెచ్చరిస్తోంది. ఈ రెండు పార్టీలు ఈసారి మహిళలకు ప్రయోజనం కలిగించే ఉచిత హామీలను ప్రకటించాయి. అలాగే యువతను ఆకట్టుకోడానికి పథకాలు ప్రకటించాయి. లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని యువత బిజెపి వైపు ఉంటేనే రక్షణ కలుగుతుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఇక కేంద్ర మంత్రి అమిత్ షా కశ్మీర్ యువతతో కేంద్రం చర్చలు జరపడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. కానీ ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా కశ్మీర్ యువత ఆందోళనలు సాగించినప్పుడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వారిపై ఉక్కుపాదం మోపి అణగదొక్కిందన్న సంగతి కాషాయ నాథులు మరిచిపోరాదు. ఇంకా చాలా మంది యువకులు ఆ కేసుల్లో నిందితులై జైళ్లలో ఇంకా మగ్గుతున్నారు. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ కాషాయం కండువా కప్పుకుంటుందా? లేక కాంగ్రెస్ స్నేహ 'హస్తం' అందుకుంటుందా? అన్నది ఎన్నికల ఫలితాలు చెబుతాయి. ఆర్టికల్ 370 రద్దు తరువాత వచ్చిన ఈ మొదటి ఎన్నికల ఫలితాలు బిజెపి ప్రభుత్వానికి రెఫరెండం కానున్నాయి. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సంయుక్తంగా పోటీలో ఉన్నాయి. మరోవైపు బిజెపి, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీలు గట్టిపోటీ ఇస్తున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ క్రమంగా 51, 36 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వల్ల విజయావకాశాలు మెరుగ్గా ఉండవచ్చని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 19.3 శాతం, నేషనల్ కాంగ్రెస్ 22.2 శాతం ఓట్లు సాధించుకున్నాయి. కశ్మీర్ లోయలో నేషనల్ కాన్ఫరెన్స్ బాగానే తన పనితీరు చూపిస్తుందన్న నమ్మకంతో కాంగ్రెస్ ఉంది. మరోవైపు జమ్మూలో మోడీ ప్రభుత్వం బలం పెంచుకుంది. జమ్మూలో మెజారిటీ సంఖ్యలో హిందువులు 37 నుంచి 43 సీట్ల వరకు ఉన్నారు. హిందూ ముఖ్యమంత్రి కావాలన్న నినాదంతో బిజెపి ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ దీనికి అనుగుణంగానే జమ్మూ రీజియన్‌లో 43 స్థానాలపై దృష్టి పెట్టి ప్రచారం సాగిస్తోంది. జమ్మూలో బిజెపి ఓట్ల బ్యాంకును కొల్లగొట్టాలన్నదే కాంగ్రెస్ వ్యూహం. సిపిఎం, జె అండ్‌కె పీపుల్స్ కాన్ఫరెన్స్ అవామీ ఇతిహాద్ తదితర పార్టీలు కూడా రంగంలో ఉన్నాయి. కాంగ్రెస్‌ను విడిచిపెట్టిన మాజీ సిఎం గులామ్ నబీ అజాద్ స్వంతంగా డెమొక్రాటిక్ ప్రొగ్రెసివ్ అజాద్ పార్టీ పెట్టినప్పటికీ అనారోగ్య కారణాల వల్ల ప్రచారం చేయడం లేదు. ఇదిలా ఉండగా తీహార్ జైలు నుంచి ఇటీవలనే విడుదలైన బారాముల్లా ఎంపి ఇంజినీర్ రషీద్ అవామీ ఇతిహాద్ పార్టీ తరపున ప్రచారం ప్రారంభించడంపై పిడిపి, సిపిఎం పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. బిజెపికి డెమ్మీ అయిన ఇంజనీర్ రషీద్ వల్ల ఓట్లు చీలిపోతాయి తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండబోదని పిడిపి నేత, మాజీ సిఎం ముఫ్తీ మెహబూబా విమర్శించారు. అవామీ ఇతిహాద్ పార్టీ అభ్యర్థులనేవారు లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనప్పటికీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారని వారికి బిజెపి వెనుక నుంచి మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ఈ ఆరోపణలను ఇంజనీర్ ఎంపీ రషీద్ కొట్టి పారేస్తున్నారు. ప్రధాని మోడీ 'నయా కశ్మీర్' బూటకపు నినాదానికి వ్యతిరేకంగా పోరాడతానని శపథంచేశారు. మరి ఓటర్లపై ఎంతవరకు ప్రభావం చూపిస్తుందో చెప్పలేం. మరోవైపు రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గత ఐదేళ్లలో జమ్మూకశ్మీర్ ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశామని, ఇదే విషయాన్ని రాష్ట్రంలోని 75% మంది ప్రజలు వెల్లడిస్తారని నమ్మబలుకుతున్నారు. బిజెపి విజయం సాధిస్తే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా తప్పనిసరిగా ఇవ్వాల్సిందే. ఓడిపోతే లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రమే జమ్మూకశ్మీర్‌లో తన పాలన పరోక్షంగా సాగించే పరిస్థితి ఉంటుంది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు విశేషమైన అధికారాలను కల్పిస్తూ కేంద్రం ఇటీవలనే చట్టంలో సవరణలు తీసుకొచ్చింది. కశ్మీర్ కిరీటాన్ని సాధించాలన్న పట్టుదలతో బిజెపి ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది.

# సర్వజన ఆస్పత్రుల్లో మార్పు మొదలు

అమరావతి,గత నెల రోజులుగా సర్వ జన ఆసుపత్రుల నిర్వహణను మెరుగుపర్చడానికి చేపట్టిన చర్యలతో మార్పు మొదలయ్యిందని, ఆశించిన మేరకు పూర్తి ఫలితాల్ని సాధించడానికి, ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసాన్ని కలిగించడానికి ఈ ప్రయత్నాన్ని చిత్తశుద్ధితో కొనసాగించాల్సి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్ఘాటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల మెరుగైన నిర్వహణ కోసం ఆగస్టు 13న విడుదల చేసిన 30 అంశాలతో కూడిన ప్రణాళిక అమలును గత నెల రోజులుగా అమలు చేసిన తీరును మంత్రి నేడు సమీక్షించారు. మూడు గంటల పాటు సాగిన ఈ సమీక్షలో 17 ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల, డిఎంఇ డాక్టర్ నరసింహం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సూపరింటెండెంట్లు ఇచ్చిన సమాచారం మేరకు ప్రభుత్వాసుపత్రుల నిర్వహణలో స్వాగతనీయమైన మార్పు మొదలయ్యిందని, ఈ ప్రయత్నాన్ని కొనసాగించాలని, ఆశించిన ఫలితాల్ని సాధించడంలో ఎటువంటి అలసత్వాన్ని ప్రభుత్వం అంగీకరించదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లోని డాక్టర్లు, ఇతర సిబ్బంది కష్టించి పనిచేస్తున్నా ప్రజల్లో పూర్తి స్థాయిలో విశ్వాసం కలగడంలేదని, ఈ లోటును వీలైనంత త్వరగా పూరించాలని మంత్రి సూచించారు. సమగ్ర మార్పు కోసం గత నెలలో ప్రకటించిన 30 అంశాల ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని మంత్రి కోరారు. మంత్రిత్వ శాఖ రూపొందించిన 30 అంశాల ప్రణాళిక మేరకు ఆయా ఆసుపత్రుల్లో గత నెల రోజులుగా చేపట్టిన చర్యల్ని సూపరింటెండెంట్లు వివరించారు. తక్కువ సమయంలో ఓపీ సేవల్ని అందించడానికి అదనపు ఓపీ కౌంటర్ల నిర్వహణ, సాయంకాలం కూడా ఓపీ సేవల్ని అందించడం, రోగులు, సందర్శకుల సమాచారం కోసం సైనేజ్ బోర్డులు ఏర్పాటు, రక్త పరీక్ష మరియు ఇతర పరీక్షల ఫలితాల్ని సాయంత్రం 2-3 గంటల మధ్య అందించడం, ఆసుపత్రులకు వచ్చిన వారికి సహాయాన్ని అందించేందుకు ఫ్రంట్ డెస్కుల ఏర్పాటు వంటి చర్యల్ని చేపట్టినట్లు సూపరింటెండెంట్లు మంత్రికి వివరించారు. వీటితో పాటు వివిధ పరీక్షల కోసం వాడే పనిముట్లు, యంత్రాల లభ్యత గురించి ఆడిట్ చేయించినట్లు, ఆసుపత్రుల ప్రాంగణాల్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గత నెల రోజులుగా చేపట్టిన చర్యలతో ఓపీ సేవలు అందుకున్న వారి సంఖ్య పెరిగినట్లు వారు తెలిపారు. రోగులు, వారి సహాయకుల నుంచి ఫిర్యాదులు అందుకునేందుకు ప్రతి విభాగంలోనూ ఫిర్యాదుల పె÷-టటెలను ఏర్పాటు చేయడంతో పాటు వారి నుంచి సేవల లభ్యతపై అభిప్రాయాల్ని తెలుసుకున్నట్లు కూడా వారు వివరించారు. రోగులకు అందించే డైట్ నాణ్యతపై నిఘా పెంచడంతో మంచి ఫలితాలు వస్తున్నట్లు కూడా వారు వివరించారు. 30 అంశాల కార్యాచరణ ప్రణాళిక మేరకు మొదటి మూడు నెలల్లో చేపట్టాల్సిన చర్యలపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించి సత్ఫలితాలను సాధించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూపరింటెండెంట్లను కోరారు. నేటి సమీక్షా సమావేశంలో వారు వివరించిన ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ధారించేందుకు ప్రత్యేక విజిలెన్స్ బృందాల్ని పంపిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యాచరణ ప్రణాళిక ప్రాధాన్యత దృష్ట్యా ప్రతి నెలా తాము సమీక్షిస్తామని కూడా మంత్రి చెప్పారు. కొంత మంది సూపరింటెండెంట్లు అందించిన సమాచారాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ డ్యాష్ బోర్డులో పరిశీలించి నిర్ధారించుకున్నారు. ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 104 కొన్ని చోట్ల సరిగా పనిచేయడం లేదని అందిన సమాచారాన్ని, మంత్రి స్వయంగా ఆ నంబరుకు ఫోన్ చేసి నిర్ధారించుకుని , ఆ లోపాన్ని వెంటనే సరిదిద్దాలని మంత్రిత్వ శాఖ అధికారుల్ని మంత్రి ఆదేశించారు. కొంతమంది సూపరింటెండెంట్లు అందించిన సమాచారం నిక్కచ్చిగా లేదని ఎత్తిచూపారు. ఈ సమావేశంలో పలువురు సూపరింటెండెంట్లు ప్రతిపాదించిన వీల్ చైర్లు, స్ట్రెచర్లు, ఇతర పరికరాలు, సిబ్బంది అవసరాల్ని పరిశీలించి వాటి లభ్యత కోసం తగు చర్యల్ని చేపట్టాలని మంత్రిత్వ శాఖ అధికారుల్ని సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రోగాల బారిన పడి ఎంతో ఆశతో, నమ్మకంతో ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు పూర్తి సంతృప్త స్థాయిలో సేవల్ని అందించే లక్ష్యంతో ఆసుపత్రుల నిర్వహణ జరగాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం.టి.కృష్ణబాబు సూచించారు. 30 అంశాల ప్రణాళిక అమలును ప్రతి వారం సమీక్షించుకుని ప్రభుత్వం, ప్రజలు ఆశిస్తున్న మార్పు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే మంజూరు చేయబడి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

# రక్తమోడుతున్న ఘాట్ రోడ్లు

చిత్తూరు,ఘాట్ రోడ్లు రక్తమోడుతున్నాయి. వరుస ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారు. దీంతో ఇప్పుడీ ఘాట్ రోడ్డు పేరు చెబితేనే ఉలిక్కి పడుతున్నారు. ముఖ్యంగా తిరుపతికి దారితీస్తున్న ఘాట్లలో ప్రమాదం పొంచి ఉంది. భారీ ట్రాఫిక్ వల్ల.. అతివేగం కూడా తోడవడంతో ఈ ప్రమాదాలు జరుగుతుండడం వల్ల.. ప్రతీ నెలా పదుల సంఖ్యలో జనాలు ప్రాణాలు వదులుతున్నారు. చిత్తూరు జిల్లాలో మూడు రోజుల్లో మూడు ప్రమాదాలు అది కూడా ఘాట్‌రోడ్లలోనే జరగడం భయాందోళనలను రేకెత్తిస్తోంది. ఈనెల 12న టమాటా లోడుతో వస్తున్న కంటైనర్ లారీ.. ఘాట్ రోడ్డు మలుపులో అదుపుతప్పి ఇన్నోవా కారుపై ఒరిగి పడింది. దీంతో ఇన్నోవా కారు అణిగిపోయి అందులో ఉన్న ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. పీలేరు మీదుగా తిరుపతికి వస్తూ మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్ రోడ్డు మొదటి మలుపులో అదుపు తప్పి పక్కనే ఎదురు వెళుతున్న ఇన్నోవా కారుపై ఒరిగిపోయింది. తిరుమల వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదానికి గురయ్యారు. ఈనెల 13 అంటే.. శుక్రవారం.. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ పరిధిలోని బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ వద్ద బస్సు, లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు చనిపోయారు. మరో 30 మంది గాయపడ్డారు. చిత్తూరు వైపు నుంచి పలమనేరు వెళుతున్న ఆర్టీసీ బస్సును.. ఐరన్ లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘాట్ రోడ్డులో అతివేగంతో వచ్చిన లారీ అదుపుతప్పి డివైడర్ దాటి పక్క రోడ్డులో వస్తున్న బస్సును ఢీకొట్టింది. అనంతరం రెండు వాహనాలు మరో లారీ మీదకు దూసుకెళ్లాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌తో పాటుగా ఏడుగురు చనిపోయారు. లారీలోని ఇనుప చువ్వల కింద ఇరుక్కుని కొంతమంది చనిపోయారు. గాయపడిన వారిలో కొంతమంది పరిస్థితి ఇప్పటికీ విషమంగా ఉంది. చికిత్స కోసం వారిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో బాధితుల ఆక్రందనలతో ఆస్పత్రి ప్రాంగణం వద్ద ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. ఇక శనివారం మరో ప్రమాదం అదే ఘాట్‌రోడ్డులో జరిగింది. శుక్రవారం ప్రమాదం జరిగిన ప్రదేశానికి అతి

# స్టీల్‌ప్లాంట్‌పై విజయసాయి రాజకీయాలు

విశాఖపట్నం,ప్రతిదాన్ని రాజకీయం చేయడం రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డికి అలవాటుగా మారిపోయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. సింహాచలం వరాహ నరసింహస్వామిని గంటా శ్రీనివాసరావు శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డి చేసిన ట్విట్‌పై ఎమ్మెల్యే స్పందించారు. విజయసాయిరెడ్డి పరిస్థితి దురదృష్టకరంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో తాను స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. స్పీకర్ ఆమోదించడం కూడా జరిగిందన్నారు. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ పార్టీ ఎంపీగా ఉన్న విజయ్ సాయి రెడ్డి రాజీనామా చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ఎ÷–లాంట్‌పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామిని రప్పించి... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని స్పష్టం చేశారని తెలిపారు.స్థానిక ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్ ఎలాంట్ ప్రైవేటీకరణ కాకుండా శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్ ఎలాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. విజయసాయిరెడ్డి రాజకీయాలు చేయాలనుకుంటే.. వేరేలా చేసుకోవడం మంచిది అంటూ హితవుపలికారు. విజయసాయి రెడ్డికి స్టీల్ ప్లాంట్ వ్యవహారంపై చిత్తశుద్ధి ఉంటే ఆనాడే రాజీనామా చేసి ఉంటే బాగుండేదన్నారు. విజయసాయిరెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# సెంటిమెంటుతో పబ్బం ఇంకానా..?

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత కూడా ఆంధ్రోళ్ల పెత్తనం వంటి మాటలు వినాల్సి రావడం నిజంగా దురదృష్టకరం. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి తలెత్తడానికి కారణం బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా చేస్తున్న దుష్ట పన్నాగాలేనని చెప్పక తప్పదు. ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర సాధన ఉద్యమానికి నేతృత్వం వహించిన టీఆర్ఎస్.. రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ వాదానికి చెల్లు చీటీ పాడేసి, ఫక్తు రాజకీయ పార్టీగా మారింది. అది అవసరం, అనివార్యం కూడా.పైగా ఇక తమది ఫక్తు రాజకీయపార్టీయేననీ, తెలంగాణ సాధనతోనే టీఆర్ఎస్ పని పూర్తయ్యిందనీ స్వయంగా అప్పట్లో ఆ పార్టీ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించిన సంగతి కూడా తెలిసిదే. అయితే అధికారం తలకెక్కి అహంకారం అవధులు దాటడంతో తెలంగాణ కాదు.. దేశం మొత్తం పాలించేయాలన్న అత్యాశతో కేసీఆర్.. తెలంగాణ అన్న పదానికే పార్టీలో స్థానం లేకుండా చేసేశారు. భారత రాష్ట్ర సమితిగా పార్టీ పేరును మార్చేసి ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా జాతీయ రాజకీయాలలోకి దూకేశారు. ఫలితం దేశ రాజకీయాలలో ప్రభావం చూపడం అటుంచి తెలంగాణలో ఉన్న పునాదులు కూడా కదిలిపోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో పార్టీ పరాజయం పాలై ప్రతిపక్షానికి పరిమితమైపోయింది. ఎన్నికలలో పార్టీ పరాజయానికి కారణమయ్యాయి. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం అన్న విషయాన్ని గుర్తించకుండా, తమ ఓటమి తెలంగాణ ఓటమిగా చెప్పుకోవడానికి ఇప్పుడు ఆ పార్టీ నాయకులు నేల విడిచి సాము చేస్తున్నారు. తమను ఓడించిన ప్రజలను నిందిస్తున్నారు. దాంతో పార్టీ ప్రతిష్ట మరింత మసకబారుతోంది. సావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన తనను జనం కాదంటారా అంటూ కేసీఆర్ ప్రజల ముఖమే చూడటం మానేశారు. ఓటమి గల కారణాలను విశ్లేషించుకోకుండా, లోపాలను సరిచేసుకునే ప్రయత్నాలు చేసుకోకుండా మళ్లీ ఆంధ్రా, తెలంగాణ అంటూ తెలుగు ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరెకపూడి గాంధీ మధ్య జరుగుతున్న వివాదం వెనుక బీఆర్ఎస్ కుట్ర విద్వేషాలు రెచ్చగట్టడమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక్కడ ఒక్కసారి గతంలోకి వెళ్లాలి. కేసీఆర్ సీఎంగా ఉన్న కాలంలో ఆపరేషన్ ఆకర్ష్ అంటూ విపక్ష పార్టీల నుంచి ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని వాటిని బలహీన పరిచారు. ఆయా పార్టీల శాసనసభాపక్షాన్ని పార్టీలో విలీనం చేసుకున్నారు. అప్పుడు తప్పుగా కనిపించని ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దగ్గరకు వచ్చే సరికి బీఆర్ఎస్ నేతలకు తప్పుగా కనిపిస్తోంది. మహాపరాధంగా కనిపిస్తోంది. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడాన్ని తెలంగాణ ద్రోహం అన్నట్లుగా చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం చాలా క్లారిటీతో ఉన్నారు. బీఆర్ఎస్ వ్యూహాన్ని, కుట్రను చాలా క్లారిటీగా వివరించారు. తెలంగాణ సెంటిమెంట్ తో రాజకీయాలు చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నదని ఆయన విమర్శించారు. తెలంగాణ సెంటిమెంట్ ను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని బీఆర్ఎస్ చూస్తోంది. రేవంత్ రెడ్డి మాటలలో ఇసుమంతైనా అతిశయోక్తి లేదు.అరెకపూడి గాంధీ పదేళ్ల పాటు బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారు. ఆ పార్టీ టికెట్ పైనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూడా గాంధీ బీఆర్ఎస్ టికెట్ పైనే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ కు మద్దతు ఇస్తున్నారు. లేదూ కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. దీన్ని ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ ఆంధ్ర, తెలంగాణ సెంటిమెంటును రాజేయాలని చూస్తోంది. అరెకపూడి గాంధీని ఆంధ్రా వ్యక్తి, ఆయనను గాజులు, చీరలు పంపిస్తాను అంటూ కౌశి క్ రెడ్డి మాట్లాడారు. అరెకపూడి ఆంధ్రా మూలాలున్న వ్యక్తి అని ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటుంటే కేసీఆర్, కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారు. అరెకపూడికి చీరలు, గాజులు అంటూ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన కౌశిక్ రెడ్డిని ఎందుకు ఉపేక్షిస్తున్నారు? గ్రేటర్ హైదరాబాద్ లోని 27 శాసనసభ స్థానాల్లో 18 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుందంటే అందుకు ఆంధ్రా సెటిలర్ల మద్దతు, వారి ఓట్లు కారణం కాదా? గేటర్ పరిధిలో 18 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న బీఆర్ఎస్ గ్రామీణ ప్రాంతాల్లో ఘోర పరాజయానికి కారణం ఆ పార్టీ అవలంబించిన తెలంగాణ వ్యతిరేక విధానాలే కారణం కాదా? ఇవన్నీ పక్కన పెడితే ఇంకా బీఆర్ఎస్ లో ఉన్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొంత మంది ఎమ్మెల్యేల గురించి ఏం చెబుతా రు?వాస్తవం ఏమిటంటే.. తెలంగాణ సెంటిమెంట్ పనికి వస్తుందని కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు ఇంకా భావిస్తుంటే అది వారి అజ్ఞానం తప్ప మరొకటి కాదు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజల పట్ల, వారి ఆకాంక్షల పట్ల నిజాయితీతో వ్యవహరించిన దాఖలాలు లేవు. అందుకే తెలంగాణ ప్రజల మద్దతును కోల్పోయింది. కారణాలు ఏవైతేనే బీఆర్ఎస్ కుగత ఎన్నికలలో ఆ మాత్రం స్థానాలు రావడానికి ఇప్పుడు ఆంధ్రా సెటిలర్ల ఓట్లే కారణం. ఇప్పుడు బీఆర్ఎస్ నేతల తీరు వారినీ బీఆర్ఎస్ కు దూరం చేయడం ఖాయం.

# జాతీయ రాజకీయాల్లో తెలుగువారి ప్రభ ముగిసినట్లేనా ?



హైదరాబాద్,జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతల పాత్ర అంతకంతకూ కనుమరుగు అవుతోంది. ముఖ్యంగా తెలుగు వారి పాత్ర లేకుండా పోతోంది. ఒకప్పుడు ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నేతలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. చక్రం తిప్పే స్థాయి నుంచి ..ఇప్పుడంతా తెరమరుగు అవుతూ వచ్చారు. తాజాగా సీతారాం ఏచూరి మరణం కూడా అలాంటిదే. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఎర్రసూరీడు కూడా అస్తమించాడు. ఇంతకాలం ఓ తెలుగు నేత ఉన్నాడన్న ధీమా ఉండేది. చిమ్మ చీకటిలో మిణుమిణుకుమంటూ కనిపించే మిణుగురు పురుగులా సీతారం ఏచూరీ కనిపించేవారు. ఆయన జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఒకప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి ఉద్దండులు జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తరవాత జైపాల్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వెంకయ్యనాయుడు, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారం ఏచూరిలు కనిపించేవారు. ఇప్పుడు ఒక్కొక్కరే అదృశ్యమవుతూ వచ్చారు. తాజాగా సీతారాం ఏచూరి కూడా కన్నుమూయడం తెలుగువారికి ఇక చోటు లేదన్నట్లుగా తయారయ్యింది. ఉపరాష్ట్రపతి పదవి విరమణ తరవాత వెంకయ్య నాయుడు కూడా జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన సిహెచ్ విద్యాసాగర్ రావు కూడా గవర్నర్ పదవి తరవాత ఇంటికే పరిమితం అయ్యారు. సురవరం సుధాకర్ రెడ్డి కూడా సిపిఐ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు. నిజానికి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కొనసాగివుంటే మంచి నేతగా రాణించేవారు. ఆయన స్వార్థ, కుటుంబ రాజకీయాల్లో పడిపోవడం వల్ల తనకున్న అవకాశాలను కోల్పోయారనే చెప్పాలి. తెలంగాణ సాధించిన తరవాత కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టివుంటే కెసిఆర్ అద్భుతంగా రాణించేవారు. భాషాపటిమ, వాక్చాతుర్యం కూడా అద్భుతంగా ఉన్న నేతగా కెసిఆర్ దేశ ప్రజలకు సుపరిచితం. కుటుంబ రాజకీయాలతో ఆయన తనకున్న ఇమేజ్‌ను దెబ్బతీసుకున్నారు. లేకుంటే జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగేవారు. నిబద్ద రాజకీయాలు నడపకుంటే రాణించడం కష్టం. నిజాయితీ కూడా చాలా ముఖ్యం. అదిలేకుంటే ఎంతటివారైనా కాల ప్రవాహంలో కొట్టుకు పోతారు. కెసిఆర్ తనయ కవిత కూడా మంచి వక్త. ఎంపిగా ఆమె బాగా రాణించారు. కానీ లిక్కర్ స్కామ్ ఆమె రాజకీయ ప్రస్థానంపై బురదజల్లింది. ఆ మరకు దాచడం చాలా కష్టం. దీంతో ఆమె కూడా ఇక రాణించడం కష్టం. మొత్తంగా ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తెలుగువారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని పూడ్చాల్సిన బాధ్యత మనపైనే ఉంది. జాతీయ రాజకీయాల్లో మనపాత్ర లేకుంటే ఉత్తరాది వారి పెత్తనం సాగనుంది. ఇప్పటికే బిజెపిలో కేవలం గుజారత్ పెత్తనమే సాగుతోంది. దేశంపై వారిద్దరే అజమాయిషీ చెలాయిస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ, ఆంగ్లంపై పట్టుతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే దేశ రాజకీయాలను ఆవపోసన పట్టాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. వాటిపై పోరాటం చేసే సత్తా ఉండాలి. అప్పుడే రాణించగలరు. తెలుగుదేశం నుంచి కేంద్రమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్ నాయుడు కొంత లోటు పూడ్చే అవకాశాలు లేకపోలేదు. అయితే ఆయన పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్చను ఇచ్చినప్పుడే ఇది సాధ్యం. ఇకపోతే సీతారం ఏచూరి మరణం తెలుగువారికి తీరని లోటు. నిబద్ద రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. అహంకారం కనిపించని మృదుస్వభావిగా జాతీయ రాజకీయాల్లో రాణించారు. సిపిఎం లాంటి పార్టీకి సారథిగా రాణించడం ఆషామాషీ వ్యవహారం కాదు. సమకాలీన రాజకీయాల్లో మంచి పట్టు ఉండడంతో పాటు, పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం, ముక్కుసూటిగా మాట్లాడడం, అవసరమున్నంత మేరకే మాట్లాడడం ద్వారా జాతీయ రాజకీయాల్లో ఏచూరి తనదైన ముద్ర వేసారు. జీవితంలో ఆయన ఎక్కడా రాజీపడలేదు. దేశ సమస్యలపై పోరాటం విషయంలో ఆయన రాజీలేని ధోరణితోనే రాజకీయాలు సాగించారు. సంకీర్ణ రాజకీయాలలో సీపీఐ (ఎం) నిర్వహించిన పాత్ర ఎనలేనిది. దానిని ఏచూరి మరింతగా ముందుకు తీసికెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కాంగ్రెస్ నేత పి. చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సిద్ధాంతాన్ని విశ్వసించారు. దేశంలో ఎక్కడ హింస జరిగినా దానికి వ్యతిరేకంగా గళం విప్పే వారు. పార్టీ అంతర్జాతీయ విభాగానికి ఏచూరి నేతృత్వం వహించారు. పలు సోషలిస్ట్ దేశాలలో పార్టీ మహాసభలు జరిగినప్పుడు సౌహార్ధ ప్రతినిధిగా ఆయన హాజరయ్యేవారు.ఏచూరి 2005లో పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనేక కీలక అంశాలను పార్లమెంట్ దృష్టికి తెచ్చే వారు. ముఖ్యమైన విషయాలపై ప్రశ్నలు సంధించే వారు. పార్లమెంట్ సమావేశాలకు తరచూ అంతరాయం కలిగిస్తున్నారంటూ పాలక పక్షం విమర్శలు చేస్తుంటే 'సమావేశాలకు ఆటంకం కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలను నిందించడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోలేదు' అని బదులిచ్చారు. పార్లమెంటును అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని చెప్పారు. భారత్–అమెరికా అణు ఒప్పందం కోసం సంప్రదింపులు జరుగుతున్న సమయంలో దానికి తమ పార్టీ విధించిన అన్ని షరతులను ఏచూరి రాజ్యసభలో ప్రస్తావించారు. జెఎన్‌యూ విద్యార్థిగా ప్రస్థానం మొదలు పెట్టిన సీతారం ఏచూరి సిపిఎం పార్టీకి జనరల్ సెక్రటరీగా అద్వితీయమైన భూమిక పోషించారు. భారత రాజకీయాల్లో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్నారు. ఆయన పాత్ర చిరస్మరణీయం. ఏచూరి తెలుగువాడు కావడం మనకు గర్వకారణం.

# చైర్మన్ నియామకంలో వివాదం ఎందుకు?



హైదరాబాద్,తెలంగాణలో ప్రజా పద్దుల సంఘం ( పబ్లిక్ అకౌంట్స్ కమిటీ–పీఏసీ) కేంద్రంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య వివాదం నెలకొంది.ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరెకపూడి గాంధీల మధ్య మాటల యుద్ధానికి దారి తీయడంతోపాటు కౌశిక్ రెడ్డి ఇంటికి అరెకపూడి గాంధీ అనుచరులతో కలిసి వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

సమస్య ఎక్కడ మొదలైంది?

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు ఆయన పేరును పీఏసీ సభ్యునిగా ఆ పార్టీ ప్రతిపాదించింది. ఆ తరువాత ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.ఇటీవల ఆయనను పీఏసీ చైర్మన్‌గా స్పీకర్ నియమించారు. దీంతో రెండు పార్టీల మధ్య వివాదం మొదలైంది."ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేకు ఎలా ఇస్తారు?" అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వంటి వారు ప్రశ్నించారు. అరెకపూడి గాంధీకి బీఆర్ఎస్ కండువా కప్పుతానంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అనడం, ఆ తరువాత ఆయన ఇంటికి అరెకపూడి గాంధీ తన అనుచరులతో వెళ్లడం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీశాయి.ఇద్దరి నేతల అనుచరుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ వివాదంలో నిరసనలకు దిగిన హరీశ్ రావు వంటి బీఆర్ఎస్ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

ఏంటీ ప్రజా పద్దుల కమిటీ?

ప్రభుత్వ ఆదాయ, వ్యయాలను లెక్కించేందుకు పార్లమెంటు ఏర్పాటు చేసే కమిటీనే పీఏసీ. దేశానికి స్వతంత్రం రాక ముందు నుంచే పీఏసీలు ఉన్నాయి.బ్రిటిష్ పాలనాకాలంలో మాంటిగ్యు–చేమ్స్‌ఫర్డ్ సంస్కరణల్లో భాగంగా 1921లో తొలిసారి పబ్లిక్ అకౌంట్స్ కమిటీని ఏర్పాటు చేశారు. నాడు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు చెందిన ఫైనాన్స్ మెంబర్ దానికి చైర్మన్‌గా ఉంటూ ఉండేవారు.ఆ కమిటీ నిర్వహణకు కావాల్సిన సహాయాన్ని ఆర్థికశాఖ చూసుకుంటూ ఉండేది.దేశానికి స్వతంత్రం వచ్చాక కేంద్ర ఆర్థికశాఖా మంత్రి పీఏసీ చైర్మన్‌గా వ్యవహరించడం మొదలైంది. 1949 వరకు ఇదే పద్ధతి కొనసాగింది.అయితే ఆర్థిక మంత్రి ప్రభుత్వంలో భాగంగా ఉంటారు. అలాంటి వ్యక్తి తమ ప్రభుత్వ పనితీరును ఎంతవరకు పారదర్శకంగా మదింపు చేయగలరు? అనే ప్రశ్న తలెత్తడంతో 1950 జనవరి 26 తరువాత అంటే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత ఆ వ్యవస్థలో మార్పులు చేశారు.పీఏసీ చైర్మన్‌గా ఆర్థిక మంత్రిని తొలగించారు. పీఏసీని పార్లమెంటరీ కమిటీగా మార్చి దాన్ని లోక్‌సభ స్పీకర్ పరిధిలోకి తీసుకొచ్చారు. దానికి చైర్మన్‌ను నియమించే అధికారం స్పీకర్‌కు అప్పగించారు.

పీఏసీ ప్రధాన విధులు:

ప్రభుత్వ శాఖల ఆదాయ వ్యయాలను లెక్కించడంఆదాయ వ్యయాల్లో లోపాలు, తప్పులు, దుబారా ఖర్చులు, లెక్కా పత్రం లేని ఖర్చులు వంటి వాటిని పరిశీలించి పార్లమెంట్, అసెంబ్లీల ముందు పెట్టడం. కాగ్ నివేదికను పరిశీలించడం. ప్రభుత్వ వార్షిక ఆర్థిక ఖాతాలను చెక్ చేయడం. ప్రభుత్వ శాఖల్లోని ఆర్థిక అవకతవకలను కనిపెట్టడం, రెవెన్యూ రసీదులను పరిశీలించడం పన్ను ఎగవేతలు, సుంకాలు విధించకపోవడం వంటివాటిని తనిఖీ చేయడంఏ శాఖైనా బడ్జెట్‌కి అనుగుణంగా ఖర్చు చేస్తుందా లేదా అని తనిఖీలు చేసే అధికారం పీఏసీకి ఉంటుంది.పార్లమెంటు ఆమోదించిన, మంజూరు చేసిన డబ్బును ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు సక్రమంగా ఖర్చు చేస్తున్నాయా లేదా అనేది పరిశీలించడం ఈ సభ్యుల ప్రధాన విధి.ఆయా లెక్కలకు సంబంధించి తనిఖీలు చేసే విస్తృత అధికారం ఆ సభ్యులకు ఉంటుంది. ఆర్థిక జవాబుదారీతనాన్ని నిర్ధరించడంలో ఈ పీఏసీ కీలకపాత్ర పోషిస్తుంది.

ఎలా నియమిస్తారు?

లోక్‌సభ బిజినెస్ రూల్ 308 ప్రకారం ప్రతి ఏడాది పీఏసీని ఏర్పాటు చేస్తూ ఉంటారు. గరిష్ఠంగా 22 మంది ఎంపీలను సభ్యులుగా నియమిస్తారు. లోక్‌సభ నుంచి 15 మంది రాజ్యసభ నుంచి ఏడుగురిని తీసుకుంటారు.కమిటీలో సభ్యులుగా ఉన్న వారిలో లోక్‌సభ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తిని చైర్మన్‌గా నియమిస్తారు స్పీకర్. 1966–67 వరకు అధికార పార్టీకి చెందిన సభలోని సీనియర్ సభ్యుడిని పీఏసీకి చైర్మన్‌గా స్పీకర్ నియమించే వారు.

1967లో తొలిసారి ప్రతిపక్షానికి చెందిన సభ్యుడిని చైర్మన్‌గా నియమించారు. నేటికీ ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ కమిటీలో సభ్యులు మంత్రులుగా ఉండకూడదు.కేంద్ర ప్రభుత్వ పీఏసీలను అనుసరించే రాష్ట్రాల్లో కూడా ఆ కమిటీల ఏర్పాటు 1950 తర్వాత మొదలైంది.తెలంగాణ లెజిస్లేటివ్ అసెంబ్లీ రూల్స్ 250, 263 ప్రకారం పీఏసీని ఏర్పాటు చేస్తారు. ఇందులో 13 మంది సభ్యులు ఉంటారు. 9 మంది శాసనసభ నుంచి నలుగురు శాసనమండలి నుంచి ఉంటారు.అలాగే అసెంబ్లీ కమిటీల్లో ఒకటిగా ఏర్పాటయ్యే ఈ పీఏసీ కమిటీల్లో 12 మంది సభ్యులు ఉంటారు. శాసనసభలో ఆయా పార్టీల బలాన్ని బట్టి సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ కమిటీ చైర్మన్ పదవిని ప్రధాన ప్రతిపక్ష సభ్యుడికి ఇవ్వడం పీఏసీ నిర్మాణంలో మొదటి నుంచి అనుసరిస్తున్న సంప్రదాయం.

పీఏసీ చైర్మన్ నియామకంలో వివాదాలు తొలిసారేమీ కాదు. 2019లోనూ పీఏసీ చైర్మన్ ఎంపిక మీద వివాదం చెలరేగింది. నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎంఐఎంకు చెందిన అక్బరుద్దీన్ ఓవైసీని పీఏసీ చైర్మన్‌గా నియమించింది.వాస్తవానికి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 88 సీట్లు రాగా కాంగ్రెస్‌కు 19 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కున్న 19 మంది సభ్యుల్లో 13 మంది బీఆర్ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 6కు పడిపోయింది. నాడు అసెంబ్లీలో 7గురు సభ్యులున్న ఎంఐఎంకు పీఏసీ చైర్మన్ పదవి దక్కింది.అయితే బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్న ఎంఐఎం పార్టీ సభ్యుడిని పీఏసీ చైర్మన్ చేశారంటూ నాడు విమర్శలొచ్చాయి. కానీ ప్రతిపక్షంలో ఎక్కువ మంది సభ్యులున్న పార్టీకి పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చామని నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సమర్థించుకుంది.ప్రస్తుతం తెలంగాణలో చోటు చేసుకున్న పీఏసీ చైర్మన్ ఎంపిక, తదనంతర పరిణామాలపై ఏపీకి చెందిన పీఏసీ మాజీ సభ్యుడు ఎమ్మెల్సీ లక్ష్మణరావు స్పందించారు.

# దోడాలో ఎన్నికల సభతో రికార్డు

శ్రీనగర్, ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి వినూత్న నిర్ణయాలతో దూసుకు పోతున్న ప్రధాని నరేంద్రమోదీ మరో సంచలనానికి తెరతీసారు. ఎర్రకోటపై బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్ ప్రొటెక్షన్ లేకుండానే గత 11 ఏళ్లుగా ప్రసంగిస్తూ వస్తున్న మోదీ.. ఇప్పుడు జమ్ము కశ్మీర్‌లో అత్యంత సున్నిత ప్రాంతమైన దోడా జిల్లా ఎన్నికల ర్యాలీలో శనివారం పాల్గొన్నారు. కాశ్మీర్‌లో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికలకు అన్ని పార్టీలు తమ పూర్తి బలాన్ని ఇచ్చాయి. బీజేపీ కూడా మిషన్ 50లో నిమగ్నమై ఉంది. ఈ లోయ ప్రాంతంలో కమలం వికసించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తర్వాత ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్ నుంచి ఎన్నికల సందడి చేస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు దోడాలో జరిగిన ర్యాలీలో ప్రధాని మోదీ ప్రసంగించి చరిత్ర సృష్టించారు. నాలుగు దశాబ్దాల తర్వాత అంటే 45 ఏళ్ల తర్వాత ఓ ప్రధానమంత్రికి ఇదే తొలి ర్యాలీ కావడం విశేషం. 1979లో ఇందిరా గాంధీ దోడాలో ర్యాలీ నిర్వహించారు. దోడా అనేక దశాబ్దాలుగా తీవ్రవాదంతో ప్రభావితమైంది. ర్యాలీకి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ర్యాలీ జరిగే ప్రదేశాన్ని డ్రోన్లతో పర్యవేక్షించారు. దీని కోసం మొత్తం కాంప్లెక్స్‌ను సీల్ చేశారు. పరిసర ప్రాంతాల్లో భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. దోడాలో ప్రధాని ర్యాలీ చీనాబ్ ప్రాంతంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. దోడా చీనాబ్ ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. చీనాబ్ ప్రాంతంలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అవి దోడా, దోడా వెస్ట్, భదర్వా, కిష్త్వార్, ఇంద్రవాల్, పదర్–నాగసేని, రాంబన్, బనిహాల్. బీజేపీ మిషన్ 50కి అన్ని సీట్లు కీలకం. జమ్మూలోని మొత్తం 43 స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తోంది. గతంలో 1979లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఇక్కడ సమావేశం నిర్వహించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల మధ్య పక్కనే ఉన్న కిష్త్వార్ జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. చీనాబ్ ప్రాంతంగా పేరొందిన జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ 13 రోజుల్లో మూడు ఎన్నికల ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలు జమ్మూ కశ్మీర్‌లో మిషన్ 50 గమ్యాన్ని చేరుకోవడానికి బీజేపీ ప్లాన్ చేస్తుంది. ఈ ర్యాలీల ద్వారా బీజేపీ ప్రత్యర్థుల దుష్ప్రచారానికి మోదీ కౌంటర్ ఇచ్చారు. సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1 తేదీల్లో జమ్మూ కశ్మీర్‌లో మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. కేంద్ర పాలిత ప్రాంతంగా అవతరించిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అందువల్ల బీజేపీతో సహా ఇప్పటి వరకు ఇక్కడ అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకమని చెప్పవచ్చు. ప్రధానమంత్రి మోదీ మూడు ర్యాలీలు బీజేపీ తన మిషన్‌ను పూర్తి చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. జమ్మూకశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో పోలింగ్ జరుగుతోంది. మొదటి దశ ఓటింగ్ సెప్టెంబర్ 18న, రెండో, మూడో దశ ఓటింగ్ సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న జరగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు రానున్నాయి. ఆగస్ట్ 31న జమ్మూ కాశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించింది. దీని తర్వాత ప్రధాని మోదీ జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.దోడా తర్వాత ప్రధాని మోదీ హర్యానాకు వెళ్లనున్నారు. మోదీ ఈ బహిరంగ సభతో ఆ రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించనున్నారు. ఆర్టికల్ 370 రద్దు సహా ఇతర అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపించనుండగా.. దాదాపు పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్‌కు ఎన్నికలు జరగనుండగా.. అవి మూడు దశల్లో జరగనున్నాయి. జమ్ము మొదటి నుంచి భారతీయ జనతా పార్టీకి స్ట్రాంగ్ హోల్డ్‌గా ఉండగా.. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 25 స్థానాల్లో విజయం సాధించింది. ఆ తర్వాత ఇప్పుడే శాసనసభ ఎన్నికలు జరగనుండగా.. బీజేపీ తమపట్టు నిలుపుకునేందుకు మోదీ బహిరంగసభ ఉపకరిస్తుందని అక్కడి నేతలు ఆశిస్తున్నారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు సహా ఆ రాష్ట్రానికి ప్రత్యేకపతిపత్తి ఎత్తేసిన తర్వాత జరుగుతున్న తొలిసారి జరుగుతున్న ఎన్నికలు కావడంతో దేశం యావత్ ఈ ఎన్నికలను ఆసక్తిగా గమనిస్తోంది. జమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో మార్పులు చోటుచేసుకోగా..లాల్‌చౌక్‌పై దాదాపు 73 ఏళ్ల తర్వాత భారత జెండా ప్రజల మధ్య ఎగురేయడం చాలా గొప్పవిషయంగా రాజకీయ విశ్లేషకులు చెబుతారు. మోదీ దేశంలో ఎన్నో ప్రాంతాలకు వెళ్లిన మొదటి ప్రధానిగానూ రికార్డు సృష్టించారు. లక్ష దీవులకు వెళ్లి కుర్చీ వేసుకుని తీరంలో కూర్చుంటేనే.. మాల్దీవుల టూరిజం కూసాలు కదిలిపోయాయి. అప్పటి వరకూ చైనా పంచన చేరి భారత్‌ను ఇబ్బంది పెడుతూ వస్తున్న మాల్దీవుల సర్కారు.. దెబ్బకు దెయ్యం వదిలి దారికి వచ్చి ంది. తొలిసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత 2015లో ఆఫ్గనిస్థాన్‌కు వెళ్లిన మోదీ.. కాబూల్ నుంచి ఆకస్మికంగా లాహోర్ వెళ్లడం అప్పట్లో సంచలం సృష్టించింది.

# దేశవ్యాప్తంగా భారీ వర్షాలు

న్యూఢిల్లీ,దేశంలో నైరుతి రుతుపవనాలు పర్వతాల నుంచి మైదానాల వరకు విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలోనే అనేక చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నేడు, రేపు కూడా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని గంగా తీరాలలో సెప్టెంబర్ 15 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఇది కాకుండా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్ అన్ని ఈశాన్య రాష్ట్రాలలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు మిజోరాం, త్రిపుర, అసోం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ ప్రాంతాల్లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని కత్రాలోని త్రికూట పర్వతంపై రోజంతా పొగమంచు కారణంగా మా వైష్ణో దేవి వద్దకు హెలికాప్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయినప్పటికీ, బ్యాటరీ కార్, రోప్‌వే సేవలు కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 18 వేల మంది భక్తులు అమ్మవారిని కొలుస్తూ భవనం వైపు బయలుదేరారు. జ్యోతిర్మఠం–మలారి రహదారిని మూసివేయడంతో 47 మంది వ్యక్తులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. పార్థదీప్‌లో కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ హైవే శుక్రవారం రోజంతా మూసివేయబడింది. సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో శనివారం వరదలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సిమ్లా హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పశ్చిమ హిమాలయ రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారులతో సహా 400కి పైగా రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. బద్రీనాథ్ హైవే కూడా రోజంతా మూసివేయబడింది. కేదార్‌నాథ్ ఫుట్‌పాత్ రెండో రోజు కూడా తెరవలేదు. హిమాచల్‌లోని రెండు జిల్లాల్లో ఆకస్మిక వరదల ప్రమాదం పెరిగింది. అదే సమయంలో మైదాన రాష్ట్రాల్లో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు జలమయమై జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఉత్తరాఖండ్‌లోని కుమావోన్ ప్రాంతంలో వర్షాల కారణంగా పలు ఘటనల్లో ముగ్గురు మహిళలు సహా ఐదుగురు మరణించారు.

# కౌశిక్‌రెడ్డి వెనుక కాంగ్రెస్ నేత.. రేవంత్‌కు చెక్ పెట్టేందుకేనా?



హైదరాబాద్,తెలంగాణలో రాజకీయాలు హీటెక్కాయి. ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి మధ్య మాటల యుద్ధం కాస్తా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య గొడవగా మారింది. ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలను చేసుకుంటూ స'వాళ్లు విసురుతున్నారు. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరును బీఆర్ఎస్‌లోని కొందరు నేతలు సైతం తప్పుబడుతున్నారు. అరెకపూడి గాంధీని ఉద్దేశిస్తూ ఆంధ్రోడు అంటూ కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించటం వెనుక మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నారని, ఆంధ్రా వాళ్లను రెచ్చగొట్టి తెలంగాణ వాదంతో మళ్లీ పబ్బం గడుపుకోవాలంటూ కేసీఆర్ చూస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు.కౌశిక్ రెడ్డి దూకుడుగా వ్యవహరించటానికి కేసీఆర్ అండదండలు ఉన్నాయో లేదో కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ మంత్రి ప్రమేయం ఉందంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆంధ్రా, తెలంగాణ వాదాన్ని తెరపైకి తేవడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలన్నది వారి వ్యూహంగా మారింది. తద్వారా రేవంత్ రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దించేసేయడానికి ఛాన్స్ ఉందని ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి... కౌశిక్ రెడ్డిని రంగంలోకి దింపడం కాంగ్రెస్‌లోని కొందరు నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కౌశిక్ రెడ్డికి అండగా ఉన్న మంత్రి ఎవరు? అనే విషయంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.పీఏసీ ఛైర్మన్ పదవి ప్రతిపక్ష పార్టీల నేతలకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. అయితే, గతంలో కేసీఆర్ ప్రభుత్వం.. పీఏసీ ఛైర్మన్ పదవిని అప్పటి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కి ఇవ్వకుండా ఎంఐఎం పార్టీకి అప్పగించింది. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన మెజార్టీ ఎమ్మెల్యేలను కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకున్నారు. దీంతో ఆ పార్టీ ప్రధాన ప్రతిపక్ష హోదా కోల్పోయింది. ఆ కారణంగానే ఎంఐఎంకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చామని అప్పట్లో బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ప్రస్తుతం పీఏసీ ఛైర్మన్ పదవి కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి పీఏసీ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. అప్పటికే పీఏసీ ఛైర్మన్ పదవికోసం బీఆర్ఎస్ హరీష్ రావు పేరు ప్రతిపాదించింది. ప్రభుత్వం గాంధీకి పదవీని ఇవ్వడాన్ని బీఆర్ఎస్‌లు తప్పుపట్టడమే కాకుండా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.గాంధీ కూడా పీఏసీ ఛైర్మన్ పదవికి దరఖాస్తు చేసుకున్నారని, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే కావడంతోనే గాంధీకి ఆ పదవిని కట్టబెట్టామని ప్రభుత్వం చెబుతున్నది. గాంధీ కూడా తాను బీఆర్ఎస్ లోనే ఉన్నాననీ, కాంగ్రెస్ పార్టీలో చేరలేదనీ చెప్పారు. దీంతో బీఆర్ఎస్ ను వ్యూహాత్మకంగా కాంగ్రెస్ ఇరకాటంలోకి నెట్టేసింది. ఇదే స'మ'యంలో కౌశిక్ రెడ్డి మీడియా సమావేశం పెట్టి గాంధీ ఇంటికి వెళ్తా.. బీఆర్ఎస్ కండువా కప్పుతానని సవాల్ చేశాడు.. ప్రతిగా గాంధీ చెప్పినూ.. నువ్వు రాకుంటే నేనే నీ ఇంటికి వస్తా అంటూ బదులిచ్చాడు. వీరిద్దరి సవాళ్లతో రచ్చ మొదలైంది. కౌశిక్ రెడ్డి, అరెకపూడి గాంధీ సవాళ్లతో పోలీసులు అప్రమత్తమై ఇరువురి నేతల ఇండ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌశిక్ రెడ్డి తన ఇంటికి రాకపోవడంతో గాంధీనే తన అనుచరులతో కొండాపూర్‌లోని కౌశిక్ నివాసం వద్దకు వెళ్లారు. పోలీసులు అడ్డుకోవటంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య కౌశిక్ నివాసంపై రాళ్లదాడికి పాల్ప డ్డారు. అప్రమత్తమైన పోలీసులు గాంధీని, ఆయన అనుచరులను అరెస్టు చేశారు. ఆ తరువాత హరీశ్ రావు, బీఆర్ఎస్ నేత కౌశిక్ రెడ్డి నివాసం వద్దకు వెళ్లి గాంధీ, ఆయన అనుచరులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి ప్రమేయంతో గాంధీ దాడికి పాల్పడ్డార విమర్శించారు. అయితే, కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రోడు అంటూ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించటంతో ఈ వివాదం కాస్త తెలంగాణ, ఆంధ్రా వివాదంగా మారింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల వెనుక కేసీఆర్ ఉన్నారని.. మరోసారి ఆంధ్రావాళ్లను తిట్టడం ద్వారా తెలంగాణ వాదాన్ని తెరపైకి తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని కుట్ర చేస్తున్నారంటూ కేసీఆర్ పై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సక్రమంగా సాగనివ్వకుండా కేసీఆర్ కుట్రలు అందుబాటులో ఉన్నాయి, కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.అయితే, కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల వెనుక కేసీఆర్ ఉన్నారా లేదా అనే విషయాన్ని పడిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా కొన సాగుతున్న వ్యక్తి మాత్రం ఉన్నారనీ, రేవంత్ రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్‌లోని కొందరు నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనితో ఆ వ్యక్తి ఎవరనే అంశంపై తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వివాదస్ప ద వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఓ మంత్రి ఉన్నారని తెలంగాణ బీజేపీ తన అధికారిక ట్విటర్ ఖాతాలో చోటు చేసుకుంది. కౌశిక్ రెడ్డికి అభయం ఇస్తున్నట్లుగా ఉత్తమ్ కుమార్ రెడ్డిని పోలి ఉన్న బొమ్మను కార్టూన్ రూపంలో విడుదల చేసింది. ఈ కార్టూన్ పై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఉత్తమ్ కుమార్ రెడ్డికి కౌశిక్ రెడ్డి దగ్గరి బంధువు. కాంగ్రెస్ పార్టీలో ఉత్తమ్ మనిషిగానే కౌశిక్ రెడ్డి వ్యవహరించారు. ఆ తరువాత బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లారు. అప్పటి నుంచి రేవంత్ రెడ్డిపై వీలుచిక్కినప్పుడల్లా తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ వస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రి అంటూ సంభోదిచారు. అంతటితో ఆగ ఉత్తమ్ కుమార్ రెడ్డి కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారని, తన నాలుకపై నల్లటి మచ్చలు కూడా ఉన్నాయని.. తాను ఏమి అంటే అది జరగకుండా తీరిగ్గా. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని వర్గ విబేధాలను బహిర్గతం చేశాయి. తనకు మంత్రి పదవి దక్కలేదని రేవంత్ పై రాజగోపాల్ రెడ్డి గుర్రుగా ఉన్నారని టాక్ నడుతోంది. మొన్న రాజగోపాల్ రెడ్డి, నేడు కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉత్తమ్ ఉన్నారని, రేవంత్ రెడ్డిని సీఎం సీటు నుంచి దింపేందుకు వేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీలో కొందరు నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద కౌశిక్ రెడ్డి వివాదం కాంగ్రెస్ లో విభేదాలను బహిర్గతం చేసిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# 3 విపక్ష రాష్ట్రాల్లో ఎన్నికల మహా సమరం..

న్యూఢిల్లీ,ఓవైపు కశ్మీర్, హరియాణా ఎన్నికల హంగామా ముగుస్తుండగానే.. మరోవైపు మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు ముంచుతున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా అత్తెసరు మెజారిటీతో గెలిచిన బీజేపీకి ఇవి కఠిన పరీక్ష పెట్టబోతున్నాయి. ఎందుకంటే సరిగ్గా రెండు నెలల్లో మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు లేవు. మొన్నటివరకు హరియాణా, మహారాష్ట్ర, కశ్మీర్ ఎన్నికలను కలిపి నియమించారని భావించారు. కానీ, వర్షాలు-వరదలను చూపుతూ ఆ రాష్ట్రంలో ఎన్నికల తేదీలు ప్రకటించలేదు. హరియాణా, కశ్మీర్ లో ఈ నెల, వచ్చే నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి.

మూడుకు మూడు కఠినమే

ఇప్పుడు రెండు రోజుల్లో ఢిల్లీగా రాజీనామా చేస్తానని కేజ్రీవాల్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రానికీ ఎన్నికల నిర్వహణ అనివార్యం. వాస్తవానికి ఢిల్లీ శాసనసభకు ఫిబ్రవరి వరకు గడువు ఉంది. అయితే, కేజ్రీ రాజీనామాతో ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి. అయితే, జార?ండ్, మహారాష్ట్రతో పాటే ఢిల్లీకీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావించినట్లు కథనాలు వచ్చాయి. వారు అలా అనుకున్నా.. కేజ్రీ రాజీనామా కూడా కలిసొచ్చింది. 2015 నుంచి ఢిల్లీలో కేజ్రీవాలే అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఓ విధంగా నరేంద్రమోదీకి గొంతులో పచ్చి వెలక్కాయ లాగా మారిన ఆయనను మద్యం కేసులో జైలుకు పంపింది కేంద్ర ప్రభుత్వం.

కొరుకుడుపడని జార?ండ్

జార?ండ్ కు 2019 డిసెంబరులో ఎన్నికలు జరిగాయి. ఇక్కడ హేమంత్ సోరెన్ సారథ్యంలో జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వాన్ని బీజేపీ నానా తిప్పలు పెట్టింది. హేమంత్ ను కూడా జైలుకు పంపింది. అయితే, ఈయన రాజీనామా చేసి తన స్థానంలో చంపయీ సోరెన్‌కు అవకాశం ఇచ్చారు. హేమంత్ బయటకు వచ్చాక దిగిపోయిన ఈయన.. బీజేపీలో చేరడం కొసమెరుపు. డిసెంబరులో



జరగాల్సిన ఎన్నికలను నవంబరులో మహారాష్ట్ర-ఢిల్లీతో కలిపి చేపట్టే వీలుంది.

మహా సమరమే..

గత ఐదేళ్లలో ఏ రాష్ట్రంలోనూ జరగని రాజకీయ మార్పులు దేశంలోని పెద్ద రాష్ట్రమైన మహారాష్ట్రలో జరిగాయి. మొదట బీజేపీ-శివసేన కూటమిలో చేరిన ఎన్సీపీ అజిత్ పవార్.. రోజుల్లోనే వెనక్కు వచ్చేశారు. కాంగ్రెస్-శివసేన (ఉద్ధవ్)-ఎన్సీపీ కూటమి ప్రభుత్వం ఉద్ధవ్ సారథ్యంలో కొన్నాళ్లు కొనసాగుతోంది. అయితే, శివసేన ఏక్ నాథ్ శిందే ద్వారా చీల్చిన బీజేపీ ఆయననే సీఎంను చేసింది. మరొక్క ఏడాదిలోనే ఎన్సీపీని అజిత్ పవార్ ద్వారా చీల్చింది. అజిత్ నూ అధికారంలో భాగం చేసింది. మహారాష్ట్రలో 2019లో అక్టోబరు 21న ఎన్నికలు జరిగాయి. ఈ లెక్కన ఈ రాష్ట్రంలోనూ హరియాణా, కశ్మీర్‌తో పాటే ఎన్నికలు నిర్వహించాలి. కానీ.. ఎన్నికల సంఘం మాత్రం నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు జార?ండ్, ఢిల్లీతో పాటు మహారాష్ట్రకు నవంబరులో ఎన్నికలు జరిపే అవకాశం ఉంది. ఇదంతా అంచనా మాత్రమే. ఎన్నికల సంఘం నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి. వీటిలో గెలవడం మాత్రం బీజేపీకి, ప్రధాని మోదీకి చాలా ప్రతిష్ఠాత్మకం. గెలుపు అవకాశాలు కనిపించడంలేదనేది విశ్లేషకుల అభిప్రాయం.

# ట్యాంక్ బండ్ వద్ద బారికేడ్ల తొలగింపు




హైదరాబాద్: ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్తత కొనసాగుతోంది. ట్యాంక్ బండ్ పై గణేష్ నిమజ్జనాలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆంక్షలపై భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్యాంక్ బండ్ పైనుంచి నిమజ్జనం లేదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, ట్యాంక్ బండ్ పై పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించారు. అనంతరం హుస్సేన్ సాగర్‌లో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కొత్త రూల్స్ తెచ్చి ప్రభుత్వం భక్తుల మనోభావాలను ప్రభుత్వం దెబ్బతీస్తోందని మండిపడ్డారు.ట్యాంక్ బండ్ పై వినాయక నిమజ్జనాలు ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పుడు కొత్త నిబంధనలు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. 2022, 2023లో ఇలాగే చెప్పారని, చివరకు ట్యాంక్ బండ్ లోనే నిమజ్జనాలు జరిగాయని గుర్తు చేశారు.ప్రభుత్వం వెంటనే ట్యాంక్ బండ్‌పై గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

# రైతులకు గుడ్ న్యూస్ పామ్ ఆయిల్ దిగుమతులపై సుంఖం పెంపు



హైదరాబాద్, ఆయిల్ పామ్ రైతులకు శుభవార్త. రైతులు పండించిన ఆయిల పామ్ గెలలకు ఇకపై అధిక ధర రానుంది. దీంతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల కష్టాలు దూరం కానున్నాయి. పామ్ ఆయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంఖాన్ని పెంచడంతో ఆయిల్ పామ్ సాగు రైతులకు మంచిరోజులు రానున్నాయి. ఇప్పటి వరకు విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి అయ్యే పామ్ అయిల్‌పై దిగుమంతి సుంఖం 5.5శాతంగా నే ఉంది.ఇకపై అది 27.5శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో దేశీయంగా సాగవుతున్న ఆయిల్ పామ్ గెలల ధరలు పెరిగే అవకాశం ఉంది. దిగుమతి సుంఖం 5.5శాతంగా ఉండడంతో ఇప్పటి వరకు విదేశాల నుంచి పామ్ ఆయిల్ పెద్ద ఎత్తున దిగుమతి అయింది. దీంతో తెలంగాణలో పండించిన పామ్ ఆయిల్ గెలలు టన్ను ధర రూ.12,000 నుంచి రూ.13వేల మధ్యనే పలుకుతోంది.అయితే కేంద్ర ప్రభుత్వం తాజాగా దిగుబతి 27.56శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో టన్ను అయిల్ పామ్ గెలల ధర టన్నుకు ఇకపై రూ.15వేల నుంచి రూ.17వేల దాకా పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా పామాయిల్ ధర కనీసం టన్నులకు రూ.1లక్ష వరకు ఉండనుంది. గతంలో ముడిపామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడంతో రాష్ట్రంలో సాగవుతున్న ఆయిల్ పామ్ గెలల ధర తగ్గి రైతులు నిరాశకు లోనవుతున్నారు.అదే సమయంలో కొత్తగా ఆయిల్ పామ్ వైపు సాగు వేయాలనుకున్న రైతులపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమైన నేషనల్ మిషన్ ఆన్‌ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్ పామ్ ద్వారా రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు పథకం అమలవుతోంది.రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ వేగంగా జరుగుతుండగా%ా% 14 కంపెనీలకు అనుమతులు వచ్చాయి. ఇందుకోసం ఆయిల్ పామ్ కంపెనీలు రాష్ట్రవ్యాప్తంగా44 నర్సరీలు ఏర్పాటు-చేశాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 2.00 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు అవుతోంది.ఇప్పటికే సాగులో ఉన్న 44,400 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుండి 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతులపై సుంకం పెంచడంతో రాష్ట్రంలోని దాదాపు 10వేల మంది ఆయిల్ పామ్ రైతులకు అధనంగా లబ్ధి చేకూరనుంది. పామ్ ఆయిల్ దిగుమతిపై భారత ప్రభుత్వం ఏటా 80 వేల కోట్ల రూపాయల విదేశిమారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తోంది.పామ్ ఆయిల్ దిగుమతులపై సుంఖాన్ని పెంచాలని తద్వారా రైతులకు అధిక ధరలను అందించొచ్చని ఇటీ-వల లేఖ ద్వారా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి విజ్ఞప్తిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందిస్తూ పామ్ ఆయిల్ దిగుమతులపై దిగుమతి సుంఖాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖకు లేఖ ద్వారా తెలిపారు.

# ఉపాధి ఉసురు తీస్తున్న మోడీ సర్కార్

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం కోసం కేంద్రానికి బిజెపి ప్రభుత్వం వివిధ రూపాల్లో కుట్రలు చేస్తోంది. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ పథకానికి నిధులు తగ్గిస్తూ రావడం, డిజిటలైజేషన్ పేరుతో ఎనలేని సాంకేతికత చిక్కుముడులేయడం, సామాజిక తరగతుల వారిగా విభజించేందుకు ప్రయత్నించడం వెరసి అన్ని విధాలుగా గ్రామీణ ఉపాధి ఊసురు తీసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ హామీనే జాబ్ కార్డుల తొలగింపు పెద్దఎత్తున కొనసాగుతోంది. మరోవైపు ఉపాధి ప్రాజెక్టులను నిర్వహించి ఉపాధి, అవసరమైన సూచనలు అందించాల్సిన కేంద్ర గ్యారంటీ మండలిని (సిఐజిసి) గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2021 మే%ా% అంటే మూడు సంవత్సరాల నుంచి ఏర్పాటు చేయడం లేదు. ఈ మండలికి గ్రామీణ శాఖ మంత్రి నేతృత్వం వహించాల్సి ఉంది. పంచాయతీరాజ్ సంస్థలు, కార్మిక సంఘాలు, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన పదిహేను మంది వరకూ సభ్యులుగా ఉంటారు.సిఇజిసి ఏర్పాటులో జరుగుతున్న తీవ్రమైన కాలయాపనను గమనిస్తే విమర్శలను వినే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేనట్లు కన్పిస్తోందని పౌర సమాజ సంస్థ అయిన నరేగా సంఘర్ష్ మోర్చాకు (ఎన్ఎస్ఎం) చెందిన అశిష్ రంజన్. 'క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై సిఇజిసి సభ్యులు సమాచారం అందజేస్తారు. కార్మికులకు సమస్యలు ఎదురవుతున్నాయా అని గుర్తించారు. సిఇజిసి ఏర్పాటులో జాప్యాన్ని గమనిస్తే ఈ పేజీకి సంబంధించి ఎలాంటి విమర్శలు వినే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేనట్టుగా ఉంది' అని అశిష్ చెప్పారు. ఉపాధి పథకం సజావుగా సాగడంలో సిఇజిసి కీలకపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. గృహ మదింపు చేసి, కార్మికుల సమస్యలను సమీక్షించే అధికారం ఉందని అన్నారు.సిఇజిసి సిఫారసులను ప్రభుత్వం విధిగా అమలు చేయలేదని, కానీ మంత్రి నేతృత్వం వహిస్తున్నందున దానికి ప్రాధాన్యత ఉందని ఆశిష్ చెప్పారు. కార్మికులు తమ హాజరును నమోదు చేయడానికి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేకపోవడంతో హాజరు నమోదు కావడం లేదు. తమ సంఘం ఇటీవలే గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్



సింగ్ చౌహాన్‌తో సమావేశమై సిజిసిని పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేసిందని ఆశిష్ తెలిపారు.గత మూడు సంవత్సరాలలో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం డాటాబేస్ నుంచి పెద్దఎత్తున జాబ్ కార్డుదారులను తొలగించింది. డూప్లికెట్ లేదా నకిలీ కార్డుల ఏరివేత ఎప్పుడూ జరిగే పనేనని ప్రభుత్వం సమర్థించుకుంటుంది. 2022-23లో రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు కోట్లకు పైగా జాబ్ కార్డులను తొలగించాయి. ఏటా సగటున కోటి నుంచి కోటిన్నర కార్డులు మాత్రమే తొలగిస్తారు. దానితో 2022-23లో తొలగించిన కార్డుల సంఖ్య బాగా ఎక్కువ.కార్డుల తొలగింపును వ్యతిరేకిస్తూ ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ ఎన్ఎస్ఎం దేశవ్యాప్తంగా పెద్దఎత్తున పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని నిర్వహించింది. పశ్చిమ బెంగాల్‌కు ఉపాధి నిధుల హామీ నిలిపివేతను నిరసిస్తూ సంతకాల సేకరణ జరిపింది. 2006-11 మధ్యకాలంలో వేతన సవరణ, సామాజిక ఆడిట్ వంటి వివిధ పాత్రలు సిఇజిసి అర్థవంతమైన నిర్వహించబడుతుందని అశిష్ గుర్తు చేశారు. అయితే కీలకమైన ఎంపికగా నిపుణుల కమిటీలను ప్రభుత్వం చేయడం సిజిసి ప్రాధాన్యత తగ్గిందని తెలిపారు. ఇప్పుడు సిజిసి ఏర్పాటును జాప్యం చేయడం ద్వారా ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసిందని ఆయన తెలిపారు. సిజిసిని ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్‌కు ఇ-మెయిల్ పంపినా ఇప్పటి వరకూ సమాధానం లభించ`లేదు.

# పార్టీ బలోపేతంపై జగన్ దృష్టి



అమరావతి,ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి, ఆ తర్వాత కీలక నేతలు పార్టీని వీడుతుండడంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులకు పార్టీలో కీలక బాధ్యతలను అప్పగించడం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులను కూడా నియమించారు. నియోజక వర్గాల ఇన్‌ఛార్జీలకూ స్థానచలనం కల్పించారు. తాజాగా పార్టీకి నలుగురు కొత్త అధికార ప్రతినిధులను నియమించారు. మాజీ మంత్రి ఆర్‌కే రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర్ రావులను అధికార ప్రతినిధులుగా అపాయింట్ చేశారు. ఇదే జాబితాలో ప్రముఖ యాంకర్ శ్యామలకు కూడా చోటు దక్కడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైసీపీ అధికార ప్రతినిధుల లిస్ట్ విడుదలైంది. అందులో మాజీ మంత్రి రోజా, యాంకర్ శ్యామల కూడా ఉన్నారు. మహిళా కోటాలో వారిద్దరికీ ప్రయారిటీ ఇచ్చారు జగన్. ఇప్పటికే వారికి ఫైర్ బ్రాండ్లు అనే పేరుంది. గత ఎన్నికల సమయంలో రోజా, శ్యామల.. ఇద్దరూ చంద్రబాబు, పవన్‌ని బాగా టార్గెట్ చేశారు. ఇప్పుడు కూడా వారికి అదే పని అప్పజెప్పారు జగన్. అధికార ప్రతినిధులుగా వైసీపీ నలుగురు పేర్లను ప్రకటించింది. భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర్, రోజా, శ్యామల ఇందులో ఉన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో కీలక పదవుల్ని భర్తీ చేస్తున్న జగన్, తాజాగా అధికార ప్రతినిధుల విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. పదవులు లేకపోయినా పార్టీ వాయిస్ ని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్.. వినిపిస్తున్నారు. వీరికి తోడు ఇప్పుడు అధికార ప్రతినిధుల జాబితా విడుదలైంది. ఇటీవల పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న రవిచంద్రారెడ్డి సాక్షి ఛానెల్ లో పార్టీ పెద్దలను విమర్శించి కలకలం రేపారు. సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన టార్గెట్ చేశారు. ఆ తర్వాత ఇతర యూట్యూబ్ ఛానెళ్లలో కూడా అలానే మాట్లాడారు. దీంతో పార్టీ అలర్ట్ అయింది. రవిచంద్రారెడ్డిని దూరం పెట్టింది. మీడియా ఛానెళ్లలో చర్చలకు వెళ్లేవారి లిస్ట్ ని ప్రకటించింది. ఈ జాబితాలో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు.. వీరితోపాటు మరో 14 మంది పేర్లు ఉన్నాయి. వీరు మినహా ఇంకెవరూ వైసీపీ తరపున ప్యానెల్ డిస్కషన్స్ లో పాల్గొనకూడదని ఆదేశాలిచ్చారు. తాజాగా పార్టీ తరపున ప్రెస్ మీట్లు పెట్టేందుకు అధికారికంగా ప్రతినిధులను నియమించారు. మాజీ మంత్రి రోజా ఇటీవల పార్టీతో కాస్త గ్యాప్ మెయింటెన్ చేస్తున్నట్టు పుకార్లు ఉన్నాయి. ఆమధ్య ఢిల్లీలో జరిగిన ధర్నాకు కూడా ఆమె హాజరు కాలేదు. ఆ తర్వాత విదేశీ యాత్రలో ఉండగా విడుదలైన ఆమె ఫొటో ఒకటి వైరల్ గా మారింది. తాజాగా విజయవాడ వరదలపై రోజా చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనంగా మారాయి. ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులంతా జగన్ ని కలిశారు. రోజా కూడా ఆ మీటింగ్ లో ఉన్నారు. ఆ మీటింగ్ తర్వాతే రోజా పేరుతో కూడిన అధికార ప్రతినిధుల జాబితా విడుదలైంది. యాంకర్ శ్యామల గత ఎన్నికల సమయంలో వైసీపీ తరపున ప్రచారంలో పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ పై ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. వైసీపీ ఓటమి తర్వాత కూడా ఆమె పార్టీతోనే ఉన్నారు. ఈ క్రమంలో ఆమెకు జగన్ కీలక పదవి ఇవ్వడం విశేషం. సినీ ఇండస్ట్రీలో ఉన్న శ్యామల వైసీపీ స్పోక్స్ పర్సన్ గా ఉంటే.. అటు మెగా ఫ్యామిలీకి, ఇటు నందమూరి ఫ్యామిలీకి కూడా వ్యతిరేకంగా మాట్లాడాల్సిన సందర్భాలు రావొచ్చు. కానీ ఆమె ప్రతిపక్షంలో ఉన్న వైసీపీతోనే కలసి నడిచేందుకు నిర్ణయించుకున్నారు. మరి పార్టీ వాయిస్ ని ఆమె ఎంత గట్టిగా వినిపిస్తారనేది ముందు ముందు తేలిపోతుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com